ప్రజాశక్తి

గురువారం 25 మే 2023 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

రాజధానిలో ముందస్తు నిర్బంధం

- రైతుల నుంచి నిరసన రాకుండా కట్టుదిట్టమైన చర్యలు
- రేపు సిఎం పర్యటనకు భారీగా జనసమీకరణ
- నేతలను మినహాయించి అధికారులకు బాధ్యతలు

సిఎం సభా ప్రాంగణంలో వివిధ శాఖల జిల్లా అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ వేణుగోపాలరెడ్డి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

రాజధాని గ్రామాల్లో పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీకి తుళ్లూరు మండలం వెంకటపాలెంలో ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. ఈనెల 26న సిఎం జగన్ గుంటూరు, ఎన్‌టిఆర్ జిల్లాలకు చెందిన దాదాపు 50 వేల మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేయనున్నారు.

సిఎంగా బాధ్యతలు స్వీకరించిన తరువాత వైఎస్ జగన్ తొలిసారి రాజధాని ప్రాంతంలో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా భారీ సభను నిర్వహిస్తున్నారు. రాజధాని అమరావతి స్థానంలో మూడు రాజధానుల ప్రతిపాదన తెరపైకి వచ్చిన తరువాత 1252 రెండు రోజులుగా రైతులు వివిధ రూపాల్లో ఉద్యమిస్తున్నారు. ఒకవైపు కోర్టులో న్యాయపోరాటం చేస్తూనే మరోవైపు ప్రభుత్వానికి తమ గోడు వెళ్లబోసుకుంటూనే ఉన్నారు. ఈ నేపథ్యంలో సిఎం జగన్ మూడేళ్లుగా రాజధాని గ్రామాల్లో పర్యటించడానికి ఆసక్తి చూపలేదు. తొలిసారిగా శుక్రవారం ఆయన వెంకటపాలెం వస్తున్నారు. దీంతో భారీగా జనసమీకరణకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కనీసం 60 వేల మంది సిఎం సభకు వస్తారని అంచనా వేస్తున్నట్టు అధికారులు తెలిపారు.

అధికార పార్టీలో తాడికొండ, మంగళగిరి నియోజకవర్గాల్లో నెలకొన్న సమస్యలతో ఈసారి జనసమీకరణ బాధ్యతలను జిల్లా అధికారులకు అప్పగించారు. వాలంటీర్ల ద్వారా ఎన్‌టిఆర్, గుంటూరు జిల్లాలకు చెందిన 50 వేలమంది లబ్ధిదారులు సభకు హాజరయ్యేలా చూడాలని ఆదేశాలిచ్చారు. ఈ మేరకు వాలంటీర్లు లబ్ధిదారులను కలిసి సిఎం సభకు రావాలని సూచించారు. ఇందుకోసం రవాణా సౌకర్యం కూడా కల్పించారు. గుంటూరు జిల్లా నుంచి 900 బస్సులు ఏర్పాటు చేశారు. ఎన్‌టిఆర్ జిల్లా నుంచి 500 బస్సుల వరకు ఏర్పాటు చేస్తున్నారు. వీరితో పాటు మంగళగిరి, తెనాలి, పెదకూరపాడు, తాడికొండ నియోజకవర్గాలకు చెందిన డ్వాక్రా మహిళలు, వాలంటీర్లు, సచివాలయాల ఉద్యోగులను కూడా సభకు రప్పిస్తున్నారు.

భారీగా వాహనాలలో ప్రజలను తీసుకువస్తుండటంతో వాహనాలకు ఇబ్బందిలేకుండా జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలను మళ్లిస్తున్నారు. ఈ మేరకు ఐజి పాలరాజ్ ఒక ప్రణాళిక రూపొందించారు. ప్రకాశం, కృష్ణా జిల్లాల నుంచి వచ్చే వాహనాలను మంగళగిరి ప్రాంతానికి రానీయకుండా ట్రాఫిక్ మళ్లింపులు ప్రకటించారు.

మరోవైపు సిఎం రాజధానికి వస్తున్న నేపథ్యంలో ఎలా నిరసన తెలపాలనే అంశంపై రైతు ప్రతినిధులు తర్జనభర్జనలు పడుతున్నారు. పోలీసుల తీవ్ర నిర్బంధం మధ్య నిరసన సాధ్యంకాదనే అభిప్రాయానికి వారు వచ్చినట్టు తెలిసింది. బుధవారం తుళ్లూరులో పోలీసులు జులుం ప్రదర్శించడాన్ని వారు జీర్ణించుకోలేకపోతున్నారు. అలాగే సిఎం సభలో ఎటువంటి నిరసనా వ్యక్తం కాకుండా పోలీసు అధికారులు డేగ కన్నుతో పరిశీలిస్తున్నారు. నిఘా విభాగం అధికారులు అప్రమత్తమయ్యారు. ▶ 2లో

వార్త మెయిన్‌లో

దీక్ష శిబిరంలో మోహరించిన పోలీసులు, రైతును అరెస్టు చేస్తున్న పోలీసులు

తుళ్లూరు దీక్షా శిబిరం వద్ద ఉద్రిక్తత

భారీగా మోహరించిన పోలీసులు, అరెస్టులు

అక్రమ అరెస్టులకు సిపిఎం ఖండన

ప్రజాశక్తి-గుంటూరు

రాజధాని ప్రాంతంలో రైతు సమస్యలు, ఇతర ప్రజా సమస్యలపై ఆందోళన చేస్తున్న నాయకులను, తుళ్లూరు దీక్షా శిబిరంలోని కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన జారీ చేశారు. రాజధానిలో సిఎం సభ పేరుతో నాయకుల్ని అక్రమ అరెస్టు చేయడం తగదని, సమస్యలపై నిరసన తెలియజేయడం, ఆందోళన చేయడం పౌరులకు రాజ్యాంగం కల్పించిన హక్కని గుర్తు చేశారు. ఈ హక్కును కాలరాయటం అంటే భావ ప్రకటన స్వేచ్ఛను హరించడమేనని పేర్కొన్నారు. ఇళ్ల స్థలాల పేరుతో ప్రజలను గందర గోళపరచకుండా ఏ గ్రామంలోని పేదలకు ఆగ్రామంలోనే ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. తాడేపల్లి పట్టణంలో 40 ఏళ్ల నుండి ప్రభుత్వ భూముల్లో నివాసముంటున్న పేదలకు పట్టాలివ్వకుండా వారికి ఇళ్ల స్థలాలు రాజధానిలో ఇస్తామని ప్రచారం చేయడం తగదని విమర్శించారు. పెదకాకాని మండలం ఎన్‌టిఆర్ కాలనీలో 30 ఏళ్లుగా 400 కుటుంబాలు ఇళ్లేసుకుని నివాసం ఉంటున్నాయని, వారిని 15 రోజుల్లో ఖాళీ చేయాలంటూ దేవాదాయ శాఖ నోటీసులు ఇచ్చిందని, ప్రజలకు ఉపాధి లభించే ప్రాంతంలోనే ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ ▶ 2లో

వార్త మెయిన్‌లో

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి సురేష్ తదితరులు

500 టిడ్కో గృహప్రవేశాలు

పేదల సొంతింటి కల నిజం చేసిన వైసిపి :మంత్రి సురేష్

60108 మందికి విద్యాదీవెన

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో మెగా చెక్కులు అందించిన కలెక్టర్లు

ప్రజాశక్తి-గుంటూరు, నరసరావుపేట

పేదరికాన్ని జయించాలంటే విద్య ద్వారానే సాధ్యం అని గుంటూరు పల్నాడు జిల్లా కలెక్టర్లు ఎం.వేణుగోపాల్‌రెడ్డి, ఎల్.శివశంకర్ అన్నారు. బుధవారం తూర్పుగోదావరి జిల్లా, కొవ్వూరు నుంచి సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా జగనన్న విద్యాదీవెన రెండో విడత నిధులు జమను ప్రారంభించగా గుంటూరులో కలెక్టరేట్ నుండి కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య, నరసరావుపేటలో కలెక్టరేట్ నుండి కలెక్టర్ ఎల్.శివశంకర్, డిఆర్ఒ వినాయకం, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి ఓబుల నాయుడు వర్చువల్‌గా పాల్గొన్నారు. గుంటూరు జిల్లాలో 28,145 మంది విద్యార్థులకు రూ.28,28,90,203 మెగా చెక్కును కలెక్టర్, ప్రజా ప్రతినిధులు అందించారు. పల్నాడు జిల్లాకు సంబంధించి 31,963 మందికి రూ 32.35 కోట్ల మెగా చెక్కును అందించారు. అనంతరం ▶ 2లో

గుంటూరు, నరసరావుపేటలో మెగా చెక్కులు అందిస్తున్న కలెక్టర్లు

రూ.4.82 లక్షల పురుగు మందులు సీజ్

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్ : పత్రాలేమీ లేకుండా వచ్చిన పరుగు మందులను వ్యవసాయాధికారులు సీజ్ చేశారు. పట్టణంలోని నవత ట్రాన్స్‌పోర్ట్‌లో రూ.4.82 లక్షల పురుగు మందులకు సంబంధించి పత్రాలేమీ లేకపోవడం వాటిని సీజ్ చేశారు. అనంతరం పలు విత్తన దుకాణాల్లోనూ తనిఖీలు చేశారు. పల్నాడు జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయం నుంచి వచ్చిన సహాయ వ్యవసాయ సంచాలకులు సిహెచ్.రవికుమార్, వ్యవసాయ అధికారులు జి.వరలక్ష్మి, హరిప్రసాద్, సత్తెనపల్లి మండల వ్యవసాయాధికారి, ఎస్.శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

విదేశాలకు వెళ్లే వారికి ఎల్లోఫీవర్ వ్యాక్సిన్ తప్పనిసరి

ప్రజాశక్తి-నరసరావుపేట

విదేశాలకు వెళ్లే వారు ఎల్లో ఫీవర్ వ్యాక్సిన్‌ను తప్పనిసరిగా వేయించుకోవాలని పల్నాడు జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి (డిఎంహెచ్ఒ) డాక్టర్ జి.శోభారాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లోనూ ఈ వ్యాక్సిన్ వేసి ధ్రువపత్రం ఇస్తారని తెలిపారు. రాష్ట్రంలో కొంతమంది ప్రైవేటు వైద్యులు వ్యాక్సిన్ వేయకుండానే ధ్రువపత్రాలు ఇస్తున్నట్లు గుర్తించారని, వారిపై చట్టపరమైన చర్యలుంటాయని స్పష్టం చేశారు. ఎవరినైనా గుర్తిస్తే ఆ ఆస్పత్రి గుర్తింపును రద్దు చేస్తామని హెచ్చరించారు. మంగళ, గురువారాల్లో అన్ని ప్రభుత్వ, జనరల్, విజయవాడ సిద్ధార్థ మెడికల్ క్యాంపస్‌లో, విశాఖపట్నం పోర్టు హాస్పిటల్‌లో ఎల్లో ఫీవర్ వ్యాక్సిన్ వేసి ధ్రువపత్రాలు జారీ చేస్తారని పేర్కొన్నారు.

ఎస్సీ,ఎస్టీ సబ్‌ప్లాన్ చిత్తశుద్ధితో అమలు చేయాలి

ప్రజాశక్తి - నరసరావుపేట

ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం అమలులో పాలకులు పారదర్శకతతో వ్యవహరించాలని దళిత గిరిజన బడ్జెట్ వాచ్ రాష్ట్ర కన్వీనర్ కన్వీనర్ అల్లడి దేవకుమార్ అన్నారు. బుధవారం స్థానిక ప్రకాష్ నగర్ లోని ఎన్ జి ఓ హోంలో జిల్లా దళిత గిరిజన బడ్జెట్ వాచ్ కన్వీనర్ మల్లెల చిన్నప్ప అధ్యక్షతన జరిగిన సమావేశంలో దేవకుమార్ మాట్లాడారు. పాలకులు చేపట్టిన పేదరిక నిర్మూలనా పథకాలు ప్రభుత్వాలు చేపట్టిన పేదరిక నిర్మూలన పథకాలు ఊరి చివర ఉన్న షెడ్యూల్ కులాలు, ఊరి అవతల ఉన్న షెడ్యూల్ తెగలకు ఇతర కులాల మధ్య ఉన్న సామాజిక ఆర్థిక అస మానతులను, తొలగించడంలో ఆశించిన స్థాయిలో మార్పులు తీసుకురాలేకపోయాయన్నారు. కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది, పల్నాడు జిల్లా ఎస్ సి, ఎస్ టి మానిటరింగ్ కమిటీ సభ్యులు మల్లెల అశోక్ ఎమ్ ఆర్ పి ఎస్ అధ్యక్షులు అడపా మోహన్ తదితరులు ప్రసంగించారు.

ఎడ్లపందేలను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే వైవీ ఆంజనేయులు

ఎద్దులు రైతు నేస్తాలు: వైవి ఆంజనేయులు

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

ఎద్దులు రైతు నేస్తాలని, గ్రామీణ సంస్కృతికి ఎడ్ల పందేలు ప్రతిబింబమని సత్తెనపల్లి మాజీ ఎమ్మెల్యే వైవి ఆంజనేయులు అన్నారు. ఎన్‌టిఆర్ శత జయంతి, శ్రీశ్రీశ్రీ అన్నపూర్ణ, విశాలాక్షి సమేత కాశీ విశ్వేశ్వర స్వామి వారి శ్రీశ్రీశ్రీ సీతారామ ఆంజనేయ స్వామి వార్షికోత్సవాలు సందర్భంగా సందర్భంగా మండలంలోని కట్టమూరులో జాతీయస్థాయి ఎడ్ల పోటీలు బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన వైవి ఆంజనేయులు పోటీలను ప్రారంభించారు. తొలుత ఆయన గ్రామస్తులతో మాటాడారు. ఈ నెల 27, 28 తేదీల్లో రాజమండ్రిలో జరిగే మహానాడుకు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు సిహెచ్.శ్రీనివాసరావు, మండల అధ్యక్షులు ఎ.అమరేశ్వరరావు, కె.రామకృష్ణ, బి.నాగేశ్వరరావు, పి.పెద్దిరాజు, ఆర్.దేవేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

మహానాడు జయప్రదం చేయాలి : జీవీ

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

రాజమండ్రిలో మే 27,28 తేదీల్లో జరగనున్న మహానాడు జయప్రదం చేయాలనీ సత్తెనపల్లి మాజీ ఎమ్మెల్యే వై వి ఆంజనేయులు తెలిపారు. బుధవారం స్థానిక ఎన్టీఆర్ భవన్‌లో టిడిపి విస్తృత సమావేశంలో ఆయన ప్రసంగించారు. సమావేశంలో రాష్ట్ర పార్టీ కార్యదర్శి చౌట శ్రీనివాసరావు, పట్టణ పార్టీ అధ్యక్షులు కె.రామకృష్ణ, మండల పార్టీ అధ్యక్షులు ఎ.అమరేశ్వరరావు,బి.నాగేశ్వరారావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సోషల్ డెమోక్రటిక్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు గురునాధం

రౌండ్ టేబుల్ సమావేశం

ప్రజాశక్తి - తుళ్లూరు

రాష్ట్ర సమగ్రాభివృద్దే లక్ష్యంగా ముఖ్య మంత్రి జగన్ మోహన్‌రెడ్డి పాలన సాగి స్తున్నా రని సోషల్ డెమోక్రటిక్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు మాదిగాని గురునాధం అన్నారు. బుధవారం రాజధాని ప్రాంతం తాళ్ళాయపాలెం జంక్షన్ వద్ద మూడు రాజధానుల శిబిరంలో బహుజన పరి రక్షణ సమితి ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సమావేశంలో గురునాధం మాట్లాడుతూ,అమరావతి ప్రాంతంలో ఉన్న అరాచక,పేదల వ్యతిరేక శక్తులకు ఎదురొడ్డి ముఖ్యమంత్రి 54 వేల మందికి ఇళ్ళ స్థలాలను పంపిణీ చేస్తున్నారని అన్నారు. అనంతరం బహుజన పరిరక్షణ సమితి నాయకురాలు సుభాషిణి మాట్లాడారు.

పొన్నూరులో టిడ్కో గృహాలు పంపిణీ

ప్రజాశక్తి - పొన్నూరు

రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్. జగన్ మోహన్ రెడ్డి టిడ్కో గహ సముదాయాలను గేటెడ్ కమ్యునిటీ స్థాయిలో నాణ్యాతా ప్రమాణాలలో రాజీ పడకుండా పూర్తి మౌలిక సదుపాయాలతో తీర్చిదిద్ది లబ్ది దారులకు అందిస్తున్నారని రాష్ట్ర పుర పాలక, పట్టణాభివద్ధి, గ్రామ/వార్డు సచివాలయాల శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ తెలిపారు. బుధవారం పొన్నూరు నగరపాలక సంఘం పరిధిలోని నిడుబ్రోలులో టిడ్కో గృహాలను ఆయన శాసనమండలి చీఫ్ విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, పొన్నూరు శాసనసభ్యులు కిలారి వెంకట రోశయ్య, ఏ.పీ టిడ్కో మేనేజింగ్ డైరెక్టర్ చిత్తూరి శ్రీధర్ , ఏ.పి టిడ్కో ఛైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మతో కలసి ప్రారంభించారు. గృహ సముదాయాల శిలాఫలకాన్ని ఆవిష్కరించి లబ్ది దారులతో కలసి గహ ప్రవేశాల్లో పాల్గొని ప్రభుత్వం తరపున నూతన వస్త్రాలను అం దించారు. టిడ్కో గృహ సముదాయ ములలో ఏర్పాటు చేసిన ఎస్‌టీపీ ప్లాం ట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ముఖ్యమంత్రి వైయస్. రాజశేఖంరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి, జ్యోతి వెలిగించి సభను ప్రారంభించారు. సభలో మంత్రి ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ పట్టణ ప్రాంతాల లోని పేద కుటుంబాలకు పటిష్టమైన గృహా లను నిర్మించి ఇవ్వాలనే దఢ సంకల్పంతో టిడ్కో ఇళ్లను అందిస్తున్నారన్నారు. పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య మాట్లాడుతూ పొన్నూరు

పట్టణంలో రూ. 177 కోట్లతో టిడ్కో గృహ సముదాయంలో 2368 ఫ్లాట్లను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. గహ సముదాయం సమీపంలోనే 99 ఎకరాల్లో నాలుగు వేల మందికి ఇంటి పట్టాలను అం దిస్తున్నారన్నారు. టిడ్కో గృహ సముదాయాల్లో పూర్తి స్థాయి మౌలిక సౌకర్యాలను రూ.23 వేల కోట్లు ఖర్చు చేసి ప్రభుత్వం అన్ని సదుపాయాలతో ప్రభుత్వం అందిస్తుందన్నారు. పొన్నూరులోని టిడ్కో గృహ సముదాయంలో ప్రస్తుతం 1660 ప్లాట్లను లబ్దిదారులకు రిజిస్ట్రేషన్ చేసి అందిస్తున్నామని, మిగిలినవి త్వరలోనే అందించడం జరుగుతుందన్నారు.

రెవెన్యూ సమస్యలు వెంటనే పరిష్కరించాలి

ప్రజాశక్తి - నరసరావుపేట

పల్నాడు జిల్లాలో రెవెన్యూ సంబంధిత సమస్యలను పరిష్కరించడంలో అధికారులు సమర్ధవంతమైన పాత్రను పోషించాలని జాయింట్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ పేర్కొన్నారు. నరసరావుపేట పట్టణంలోని మున్సిపల్ అతిథిగృహంలో రెవెన్యూ శాఖ సంబంధించిన అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం బుధవారం నిర్వహించారు. సమావేశంలో ప్రధానంగా కౌలు రైతు కార్డులు పంపిణీ, రుణాలను బ్యాంకర్ల ద్వారా లక్ష్యం మేరకు ఇప్పించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రెవెన్యూ, వ్యవసాయ అనుబంధ శాఖలు కమిటీగా ఏర్పడి కౌలు రైతులకు మేలు చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సూచించారు. ఖరీఫ్‌లో నాణ్యమైన విత్తనాలు, ఎరువులు ఆర్‌బికెల ద్వారా రైతులకు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. జిల్లాలో విత్తనాల కొరత, బ్లాక్ మార్కెటింగ్ ద్వారా విక్రయాలు వంటి అంశాలపై సంబంధిత అధికారులు ప్రత్యేక దష్టి సారించాలన్నారు. కౌలు రైతుల ఆత్మహత్యలకు సంబంధించి పరిహారం విషయంలో కమిటీ అందిస్తున్న నివేదికలు సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకుంటూ, త్వరితగతిన పరిహారం అందించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. తహశీల్దార్‌లు నెలలో 30 లోపు ఎంఎల్ఎస్ పాయింట్లు, చౌకధరల దుకాణా

సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న పల్నాడు జిల్లా జెసి ఎ.శ్యామ్ ప్రసాద్

కేంద్రాలను ఆకస్మిక తనిఖీ చేపట్టాలన్నారు. తనిఖీలు వివరాల నివేదికను ప్రభుత్వానికి పంపాలని పేర్కొన్నారు. జిల్లాలో కౌలు రైతు కార్డులు 2021-22 ఏడాదిలో అందించిన లక్ష్యానికి 25శాతం అదనంగా ఉండగా, 2022 -23 ఏడాదిలో ఆ శాతాన్ని రెట్టింపు చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశించారు.

22.ఏ చుక్కల భూములకు సంబంధించి, అర్హత కలిగిన రైతులకు వాస్తవ విచారణ నిర్వహించి రెవెన్యూ భూముల రికార్డులలో వివరాలను నమోదు చేసి హక్కుపత్రాలను మంజూరు చేయాలన్నారు. సమావేశంలో రెవెన్యూ అధికారి వినాయకం, డిప్యూటీ కలెక్టర్లు, రెవెన్యూ డివిజన్ అధికారులు, తహశీల్దార్లు, సర్వేయర్లు, మండల వ్యవసాయ శాఖ అధికారులు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, భూ సర్వే, రికార్డుల శాఖ అధికారి పాల్గొన్నారు.

మధుమేహ బాధితులకు ఇన్సులిన్ తప్పదు

ప్రముఖ ఫిజీషియన్ డాక్టర్ టి.వి .నారాయణరావు

ప్రజాశక్తి-గుంటూరు

మధుమేహ బాధితులకు తొలి దశలో ఆహార నియమాలు, వ్యాయామం ముఖ్యపాత్ర పోషించినా కొంతకాలం తర్వాత నోటి ద్వారా తీసుకునే మాత్రలు, ఆ నోటి మందులు కూడా జీవితాంతం పనిచేయవని, ఏదో ఒక దశలో ఇన్సులిన్ తీసుకోక తప్పదని, ఆ విషయాన్ని ప్రతి ఒక్క మధుమేహ బాధితులు గుర్తించాలని ప్రముఖ ఫిజీషియన్ డాక్టర్ టి.వి. నారాయణరావు అన్నారు. మంగళవారం రాత్రి స్థానిక జిఎంఎ హాల్లో, ఐఎంఎ గుంటూరు శాఖ ఆధ్వర్యంలో 'మధుమేహ చికిత్సలో మందులు ఇన్సులిన్ అనే అంశంపై నిర్వహించిన వైద్య విద్యా కార్యక్రమంలో డాక్టర్ నారాయణరావు పాల్గొని ప్రసంగించారు. ఐఎంఎ గుంటూరు అధ్యక్షులు డాక్టర్ ఆవుల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డాక్టర్ నారాయణరావు మాట్లాడుతూ ముఖ్యంగా టైప్-2 మధుమేహం నియంత్రణలో తొలి దశలో ఆహార నియమాలు, వ్యాయామం కీలక పాత్ర పోషించినా కొంత కాలం తర్వాత నోటి ద్వారా తీసుకునే మందులు తీసుకోక తప్పదన్నారు. ఆ మందులు కూడా చాలాకాలం తర్వాత పనిచేయడం మానేస్తాయన్నారు. నేడు ఎన్ని రకాల కొత్త మందులు వచ్చినా అవి కొంతకాలమే రక్తంలోని షుగర్ శాతాన్ని సమర్ధవంతంగా నియంత్రించగలమన్నారు. ఆయా బాధితులు వ్యక్తిగత జాగ్రత్తలు, ఆరోగ్యం, ఆహారం, వ్యాయామం, మందుల మోతాదులపై ఆయా మందుల పనితీరు ఆధారపడి ఉంటుందన్నారు. జీవితాంతం మందులతోనే మధుమేహంను నియంత్రించడం సాధ్యం కాదన్నారు.కావున ఇన్సూలిన్ తీసుకోవాలన్నారు. నోటి ద్వారా తీసుకునే మందులతో మధుమేహం నియంత్రణ అనే అంశంపై డాక్టర్ వివి రామ్‌కుమార్ మాట్లాడుతూ మధుమేహ బాధితులు యాంత్రికంగా రోజు మందులు వేసుకుంటున్నామని, షుగర్ తగ్గే ఉంటుందంటే ప్రయోజనాలు లేదన్నారు. మందులు ఎలా పని చేస్తున్నాయో తరచు సుగర్ పరీక్ష చేయించుకోవాలన్నారు. సభానంతరం డాక్టర్ టివి నారాయణరావుకు, ప్రముఖ ఫిజీషియన్ డాక్టర్ వైవిఎస్ ప్రభాకర్, డాక్టర్ రామ్ కుమార్‌కు ప్రముఖ చెస్ట్ ఫిజీషియన్ డాక్టర్ జి బాబురావు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఐఎంఎ ఉపాధ్యక్షులు డాక్టర్ టి. సేవ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

'సెన్సె సెమీ కండక్టర్స్'తో వివిఐటి ఒప్పందం

ప్రజాశక్తి-తెనాలి: విద్యార్థులకు భారీ వేతనాలతో కూడిన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు బెంగళూరుకు చెందిన ప్రముఖ సెన్స్ సెమీ కండక్టర్స్ అండ్ ఐటీ సొల్యూషన్స్ తో నంబూరులోని వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల ఒప్పందం కుదుర్చుకుంది.

రాజధానిలో ముందస్తు నిర్బంధం

(మొదటి పేజీ తరువాయి)

సిఎం సభలో ఇబ్బందులేమీ లేకుండా చూసేందుకు మఫ్టీలో పోలీసులను పెద్ద సంఖ్యలో ఏర్పాటు చేస్తున్నారు. మొత్తంగా వైసిపి ఈ సభను ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. రాజధాని మార్పు వల్ల వ్యతిరేకత ఏమీ లేదని చెప్పుకునేందుకు భారీ సభ ద్వారా సిఎం కార్యాలయం నుంచి వస్తున్న సూచనలతో యంత్రాంగం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. ఇళ్ల పట్టాల పంపిణీలో భాగంగా మంగళగిరి తహశీల్దార్ రాం ప్రసాద్ 38 వేల పట్టాలకు సంతకాలు చేశారు.

60108 మందికి విద్యాదీవెన

(మొదటి పేజీ తరువాయి)

కలెక్టర్లు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రాథమిక విద్య నుంచి ఉన్నత విద్య వరకూ పేదలకు ఉచితంగా అందించేందుకు జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన, విదేశీ విద్యా దీవెన కార్యక్రమాలను అమలు చేస్తున్నారన్నారు. విద్య కోసం పేదలకు ఆర్థిక ఇబ్బందులు ఉండకూడదని జగనన్న విద్యా దీవెన ద్వారా పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను అందిస్తున్నారన్నారు. ఈ మొత్తాలను విద్యార్థుల తల్లుల ఖాతాలకు జమ చేసినట్లు చెప్పారు. ప్రభుత్వ పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని బాగా చదవాలని, ఉన్నత స్థానాలు అధిగమించి, వారి కుటుంబం, సమాజ అభివృద్ధికి దోహదపడాలని సూచించారు. కార్యక్రమంలో గుంటూరు కలెక్టరేట్ నుండి రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ ఎం.శేషగిరిరావు, రాష్ట్ర శాలివాహన, కుమ్మరి కార్పొరేషన్ ఛైర్మన్ మండేపూడి పురుషోత్తం, రాష్ట్ర విభిన్న ప్రతిభావంతులు, సహాయ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ ముంతాజ్ పఠాన్, సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరక్టర్ మధుసూదనరావు, బీసీ సంక్షేమ శాఖాధికారి నర్సారెడ్డి, ఎన్‌ఆర్‌ఈడీసీ డైరక్టర్ కొత్త చిన్నపరెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరక్టర్ అబూదా షరీఫ్ పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులకు సిపిఎం ఖండన

(మొదటి పేజీ తరువాయి)

సమస్యల పరిష్కారానికి భవిష్యత్‌లో ఆందోళన చేస్తామని ప్రకటించారు. **ప్రజాశక్తి - తుళ్లూరు :** జై భీమ్ పార్టీ వ్యవస్థాపకులు జడ శ్రావణ్ కుమార్‌ను తుళ్లూరులో పోలీసులు అరెస్టు చేసి తుళ్లూరు పోలీస్‌స్టేషన్‌లో నిర్బంధించడాన్ని సిపిఎం రాజధాని కమిటీ ఖండిస్తున్నట్లు కమిటీ కార్యదర్శి ఎం.రవి ఒక ప్రకటనలో తెలిపారు. మూడేళ్ల నుండి తుళ్లూరు రైతు దీక్షా శిబిరంలో రైతులు, మహిళలు శాంతియుతంగా నిరసన తెలియజేస్తుండగా బుధవారం పోలీసులు రైతుల ధర్నా శిబిరంలోకి చొరబడి రైతులు, మహిళలపై దౌర్జన్యం చేయటం, శ్రావణ్‌కుమార్ సహా రైతులను, మహిళలను దూషించడం, అక్రమంగా అరెస్టు చేయడం ప్రజాస్వామ్య హక్కులను, భావ ప్రకటనా స్వేచ్ఛను హరించడమేనని విమర్శించారు.

పాము కాటుకు గురైన కానిస్టేబుల్ మృతి

ప్రజాశక్తి - తుళ్లూరు

పాము కాటుకు గురైన కానిస్టేబుల్ చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం మృతి చెందాడు. రాజధాని ప్రాంతం అనంతవరం లో ఆర్ 5 జోన్ లో జంగిల్ క్లియరెన్స్, ప్లాట్ల చదు ను పనులు జరుగుతున్న నేపథ్యంలో ప్రకాశం జిల్లా కు చెందిన కానిస్టేబుల్ పవన్ కుమార్ బందోబస్తు కు వచ్చి పాము కాటుకు గుర య్యాడు. మంగళవారం అనంతవరంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి గుడికి దిగువన టెంట్ లో నిద్రిస్తున్న సమయంలో పాము కరిచింది.పవన్ ను వెంటనే ఆసుపత్రికి తరలించారు. గుంటూరులోని రమేష్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.

ఎద్దు తన్నడంతో బాలిక మృతి

ప్రజాశక్తి-ఈపూరు

ఎద్దు దాడి చేయడంతో బాలిక మృతి చెందిన ఘటన మండల కేంద్రమైన ఈపూరు బుధవారం జరిగింది. గ్రామంలోని బిసి కాలనీకి చెందిన ముద్దా కోటేశ్వరరావు పెద్ద కుమార్తె ముద్దా మహేశ్వరి (7) ఇంటి వెనుక ఆడుకునేందుకు వెళ్తుండగా, అదే సమయంలో పొలం నుండి ఎద్దులు ఇంటికి వెళుతున్నాయి. వాటి వెనుక నడుస్తున్న మహేశ్వరిని ఓ ఎద్దు కాలితో బలంగా తన్నడంతో ఆమె పొట్ట,గుండె భాగంలో బలమైన గాయమై కింద పడిపోయింది. వెంటనే బాలికను స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లాలని వైద్యులు రాంబాబు సూచించారు. అందుబాటులో వాహనాలు లేకపోవడంతో తనకారు లో తీసుకెళ్లాలని తెలపడంతో వెంటనే వినుకొండ ప్రైవేట్ ఆస్పత్రికి బాలికను తరలించారు. అప్పటికే బాలిక మృతి చెందినట్లు వైద్యులు

మృతి చెందిన బాలిక ముద్దా మహేశ్వరి

తెలిపారు. ముద్దా కోటేశ్వరరావు, లక్ష్మి దంపతులకు ముగ్గురు కుమార్తెలు.పెద్ద కుమార్తె మహేశ్వరి. స్థానిక ప్రాథమిక పాఠశాలలో రెండోవ తరగతి చదువుతోంది. పాఠశాలకు సెలవులు ఇవ్వడంతో ఇంటివద్దే ఉంటుంది. సరదాగా ఆడుకుంటూ కళ్ళముందు తిరిగే మహేశ్వరి విగతజీవిగా పడిఉండటంతో బాలింత తల్లి కన్నీరు మున్నీరవుతుంది.

లారీ బ్యాటరీ చోరీ

ప్రజాశక్తి-తాడేపల్లి

సాయిబాబా గుడి వద్ద గల మహాలక్ష్మి ట్రాన్స్ పోర్టు కు చెందిన లారీ బ్యాట రీని బుధవారం తెల్లవారు జామున ఐదు గంటలకు దొంగలు ఎత్తుకుపోయారు. ఆ మేరకు బాధితులు తాడేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బ్యాటరీకి రక్షణగా ఉన్న చెక్కను పగలగొట్టి దర్జాగా బ్యాటరీని దొంగ తీసుకెళ్తున్న దృశ్యాలు సిసి టివి ఫుటేజీలో ఉన్నాయి. తాడేపల్లి క్రైం పోలీసులు కేసు విచారిస్తున్నారు.

'పెద్దిరెడ్డి వ్యాఖ్యల్లో తప్పులేదు'

ప్రజాశక్తి-తాడేపల్లి: మందా కృష్ణమాదిగపై మంత్రి పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డి చేసిన వ్యాఖ్యల్లో తప్పులేదని మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కె.కనకారావు సమర్థించారు. బుధవారం ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జాతి ప్రయోజనాలను చంద్రబాబు నాయుడు వద్ద తాకట్టు పెట్టడం కృష్ణ మాదిగకు బాగా తెలుసని విమర్శించారు.

కౌలు రైతు గుర్తింపు కార్డులకు అర్జీలు

ప్రజాశక్తి-కొల్లిపర

రైతులు, కౌలు రైతులు కార్డులు పొం దేందుకు తమ వివరాలు పొందుపరుస్తూ రైతు భరోసా కేంద్రాల్లో అర్జీలు సమర్పించాలని మండల వ్యవసాయ అధికారి కె.వెంకట్రావు తెలిపారు. బుధవారం వ్యవసాయ కార్యా లయంలో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ రాయితీలు, ఎరువులు, పంట విక్ర యాలకు, ఈ-క్రాప్ నమోదుకు గుర్తింపు కార్డు అవసర మన్నారు. రైతులు తమ పొలాలను కౌలు చేసే వారికి సంబంధిత పత్రాలను ఇచ్చి నందువలన భూ హక్కులకు నష్టం వాటిల్లిందని స్పష్టం చేశారు.

సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి -గుంటూరు

రాష్ట్రంలో సైబర్ నేరాలు రోజురోజుకి పెరిగిపోతున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీస్ శాఖ నిత్యం హెచ్చరిస్తున్నా చాలా మందికి కనువిప్పు కలగడంలేదని అవగాహన సంస్థ కార్యదర్శి కొండారామిరెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. సైబర్ వలలో పడుతున్నది అమాయకులు, నిరాక్ష్యరాస్యులు కాదని బాగా చదువుకున్న వారే ఎక్కువగా మోసపోతున్నారని తెలిపారు. మోసపూరిత ప్రకటనలతో తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందవచ్చని, లోన్లు ఇప్పిస్తామని చేప్పేవారితో జాగ్రత్తగా ఉండాలని అవగాహన సంస్థ ప్రజలకు విజ్ఞప్తి చేస్తుందన్నారు.

వివరాలు వెల్లడిస్తున్న టిడిపి నాయకులు

1 నుంచి ఆలపాటి 'పెళ్ళికానుక'

ప్రజాశక్తి-తెనాలి

శకపురుషుని శతజయంతి వేడుకలు ముగియనున్న సందర్భంగా మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ మరో కొత్త పథకానికి శ్రీకారం చుట్టారు. నియోజకవర్గంలో తెల్ల రేషన్ కార్డ్ కలిగిన వారి కుటుంబాలలో జరిగే వివాహాలకు పెళ్ళికానుకగా వారి వారి మతాచారాల ప్రకారం తాళిబొట్టు కానీ ఉంగరం గాని వివాహ సమయానికి అందించనున్నట్లు ఆ పార్టీ నాయకులు శాఖమూరి చిన్న చెప్పారు. స్థానిక పార్టీ కార్యా లయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ ఈ పథకం అమలుకు పార్టీ ఆధ్వర్యంలో ఒక కమిటీని ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. అర్హులైన వారు వివాహానికి పది రోజులు ముందుగా కార్యాలయంలో దర ఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి వివాహ సమ యంలో పెళ్లి కానుక ఆలపాటి చేతుల మీదుగా అందిం చడం జరుగుతుందన్నారు. వివరాలకు కార్యాలయంలో సంప్రదిం చాలన్నారు. సమావేశంలో నాయకులు టీ హరిప్రసాద్, ఎస్ నాగేశ్వరరావు ఈదర వెంకటపూర్ణచంద్, ఎం విజయ్ కుమార్ కె శ్రీనివాసరావు, జి ప్రసాద్ పాల్గొన్నారు.

సృజనాత్మకత, నైపుణ్యాలతో విజయాలు: విసి

ప్రజాశక్తి-ఎఎన్‌యు

ఉన్నత విద్య, సృజనాత్మకత, నైపుణ్యాలు విద్యార్థుల విజయానికి సోపానాలని, విద్యార్థులు కష్టపడి చదువుకుంటూ ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని వర్సిటీ విసి పి.రాజశేఖర్ తెలిపారు. జువాలజీ విభాగ విద్యార్థులు తమ ప్రతిభా పాటవాలతో పివిఎస్‌గ్రూప్ ఆఫ్ ఇండియా ఇంటర్నేషనల్ హెల్త్ కేర్ లో ఉద్యోగాలకు ఎంపికకావడం సంతోషదాయకమని అన్నారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను అభినందించారు. జువాలజీ విభాగాధిపతి ఆచార్య కె.సునీత మాట్లాడుతూ ఆక్వా కల్చర్, మైక్రో బయాలజీ, బయో టెక్నాలజీ విభాగాలనుండి పివిఎస్‌గ్రూప్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన వాక్ ఇన్ ఇంటర్వ్యూలో 11 మంది విద్యార్థులు ఎంపికైనట్లు చెప్పారు. క్యాంపస్ డ్రైవ్ లో



విద్యార్థుల నైపుణ్యాలను ఆధారంగా చేసుకొని తమ సంస్థలోకి ఎంపిక చేసుకున్నామని పీ.వీ.ఎస్.గ్రూప్ ఆఫ్ ఇండియా లాబొరేటరీస్ రీసెర్చ్ డెవలప్మెంట్ డైరెక్టర్ బి.రాజేష్, మానవ వనరుల విభాగ సభ్యులు విజయవాడ శాఖకు చెందిన ఇ. రమేష్ తెలిపారు.

రూ.2 వేల నోట్ల మారకంలో అమలు కాని ఆర్‌బిఐ మార్గదర్శకాలు

ప్రజాశక్తి - గుంటూరు

రూ.2వేల నోట్లు విషయంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రకటించిన మార్గదర్శకాలు క్షేత్ర స్థాయిలో అమలు కావ డం లేదని, మధ్య తరగతి ప్రజలు ఆ నోట్లను మార్చుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బుధవారం అవగాహన సంస్థ తెలిపింది. మంగళవారం నుండి ప్రారంభమైన నోట్ల మార్పిడి ప్రక్రియలో ప్రజలకు స్పష్టత లేకపోవడంతో ఇబ్బందులు పడు తున్నారన్నారు. పాన్, ఆధార్ వంటి గుర్తింపు కార్డుల అవసరం, డబ్బును ఖాతాలోనే జమ చేసుకోవాలని, బ్యాంకులు కోరడం అనవసరం అని, దీంతో గందరగోళ పరిస్థితి ఏర్పడుతుందని సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి తెలిపారు. ఎటువంటి గుర్తింపు కార్డులు లేకుండా నోట్లను మార్చుకోవచ్చని ఆర్‌బిఐ చెప్పినప్పటికీ అమలు కాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు.

సెప్టెంబర్ 30 వరకు గడువు ఉన్నప్పటికీ రోజువారీ లావాదేవిల్లో ఎదురవుతున్న ఇబ్బందుల దృష్ట్యా రూ.2 వేల నోట్లను మార్చు కునే విషయంలో అధికారులు, బ్యాంకులు సహకరించాలని అవగాహన సంస్థ విజ్ఞప్తి చేస్తుందని కొండా శివరామిరెడ్డి తెలిపారు.

విలక్షణ నటుడు శరత్‌బాబు

ప్రజాశక్తి - గుంటూరు

మంచి నటనతో, చక్కటి వాచకంతో ప్రేక్షకులను ఆకట్టుకున్న విలక్షణ నటుడు శరత్‌బాబు అని, చలనచిత్ర పరిశ్రమలో ఎన్నో గుర్తుండిపోయే పాత్రలు పోషించారని, వారి మరణం బాధాకరమని అవగాహన సంస్థ సభ్యులు నివాళులర్పించారు. బుధవారం అవగాహన సంస్థ కార్యాలయంలో నటుడు శరత్‌బాబు సంతాప సభ నిర్వహించారు. ముందుగా శరత్‌బాబు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గాయకులు కె మురళీకృష్ణ మాట్లాడుతు ఎలాంటి పాత్రలోనైనా ఒదిగిపోయే విలక్షణ నటుడు శరత్‌బాబు అని కొనియాడారు. ఇది కథకాలు, సితార, జీవనజ్యోతి, కాంచనగంగ, సంసారం ఒక చదరంగం, సాగర సంగమం లాంటి సినిమాల్లో శరత్ బాబు పోషించిన పాత్రలు తెలుగు ప్రజలు ఎప్పటికీ మర్చిపోరన్నారు. ఆయన మృతి చిత్ర పరిశ్రమకు తీరని లోటని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా రామిరెడ్డి తెలిపారు.

సివిల్స్‌లో సత్తా చాటిన విద్యార్థులకు అభినందన

ప్రజాశక్తి - గుంటూరు

ప్రతిభాపాటవాలకు అసలు సిసలు పరీక్ష అయిన సివిల్స్‌లో తెలుగు వారు మరోసారి సత్తా చాటి తమ ప్రతిభను మరోసారి దేశప్రజలకు తెలియజేయడం పట్ల అవగాహన సంస్థ హర్షం వ్యక్తం చేస్తుందని సంస్థ కార్యదర్శి కొండా రామిరెడ్డి బుధవారం తెలిపారు. వందలోపు ర్యాంకుల్లో తెలుగువారు ఉండటం తెలుగు రాష్ట్రాల నుండి 46 మందికి పైగా సివిల్స్‌లో అర్హత సాధించడం గొప్ప విషయమని భవిష్యత్తులు వీరందరూ గొప్ప అధికారులుగా గుర్తింపు తెచ్చుకోవాలని అభిలషించారు.

కేతు విశ్వనాథరెడ్డికి ఘన నివాళి

ప్రజాశక్తి - గుంటూరు

రాయలసీమ కథకుడు, నవలాకారుడు, సాహిత్య విద్యా ప్రచురణ సంపాదకులు, అభ్యుదయ సాహిత్య పితామహుడు కేతు విశ్వనాథరెడ్డి అని వక్తలు తెలిపారు. బుధవారం అవగాహన సంస్థ కార్యాలయంలో రచయిత కేతు విశ్వనాథరెడ్డి అవగాహన సభ్యులు నివాళాలర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు తెలుగు సాహిత్యంలో కథకుడిగా శాశ్వతస్థానం సంపాదించుకున్నారని, తన చుట్టూ ఉన్న సమాజాన్ని నిశితంగా పరిశీలించి, శాస్త్రీయ దృక్ఫథంతో మాన సంబంధాలను విశ్లేషిస్తూ రచనలు చేసే కేతు మరణం సాహిత్య రంగానికి తీరని లోటని తెలిపారు. రాయలసీమ వ్యవసాయ సంక్షోభాన్ని , మనుగడల విధ్వాంసాన్ని వాటి మూల కారణాలతో సహా కథనం చేశారని చెప్పారు.

అర్థిక సమస్యలు, దోపిడీ, దుర్భిక్షం మాత్రమే చిత్రించి ఊరుకోలేదని, మానవ సంబంధాలు, పరిస్థిల మధ్య విలవిల్లాడే నైతికతలను కూడా ఆయన పట్టుకున్నారని సంస్థ సభ్యులు తెలిపారు. కేంద్ర సాహిత్య అకాడమి పురస్కారం పొందిన విశ్వనాధరెడ్డి మృతి సాహిత్యప్రియులు అందరికీ తీరని లోటని నివాళులర్పించారు.

ఒరిజినల్ దస్తావేజు పోయినది

గుంటూరుజిల్లా, పొన్నూరు పట్టణం, ఇటికంపాడు రోడ్డు, డోర్ నెం. 22-2-17 రు కాపురస్తుడు షేక్ ఖాదర్ వలి గారి కుమారుడు షేక్ సాజిద్ గారి తాత గారు అయిన షేక్ మీరాసాహెబ్ గారికి చెందిన స్థలానికి సంబంధించిన డాక్యుమెంట్ నెం. 446/1966 నెంబరుగల ఒరిజినల్ దస్తావేజును పొన్నూరు ఐలాండ్ సెంటర్‌లోని ఫొటోస్టాట్ సెంటర్‌కు వెళ్ళి తీయించుకొని వచ్చుచుండగా పై తెలిపిన దస్తావేజు కవరు జారిపోయినది. తర్వాత ఎంత వెదికిననూ దొరకలేదు. పై తెలిపిన ఒరిజినల్ దస్తావేజు వున్న కవర్ ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్‌కు అందజేయగలరు.

ఇట్లు
షేక్ సాజిద్,
సెల్ : 90552900361

జనరల్ నోటీసు
మహారాజశ్రీ తెనాలి 11వ అదనపు జిల్లాజడ్జి గారి కోర్టులో
జి.డబ్ల్యు.ఓ.పి. 356/2023

బిట్వీన్
తాడికొండ రాధాప్రియాంక @ పూజ్య ... పిటీషనర్
ఎదిరి
తాడికొండ నవీన్ కుమార్ గుప్త ... రెస్పాండెంట్

పై నెంబరు పిటీషన్‌ను పిటీషనరు తన కుమారుడైన హరీష్ నారాయణమూర్తి కస్టడీ కొరకు రెస్పాండెంటుపై దాఖలు చేయు శ్రీ కోర్టువారు ఈ పేపరు ప్రకటన ద్వారా రెస్పాండెంటుకు మరియు యావన్మందికి తెలియజేయగలందులకు నోటీసు ఆర్డరు వేస్తూ ది. 21-6-2023వ తేదీకి వాయిదా వేసినారు. సదరు వాయిదారోజు ఉదయం 10-30 గం.లకు పై కోర్టులో పై పిటీషన్‌పై అభ్యంతరాలున్న వారు స్వయంగా గానీ, వారి ప్లీడరుగారి ద్వారా గానీ హాజరై ఆక్షేపణలు తెలుపుకొన వలెను. లేనియెడల ఎవరికి ఎట్టి ఆక్షేపణలు లేవని పై పిటీషన్‌ణు విచారించి తీర్మానించగలరని యావన్మందికి తెలియజేయడమైనది.
వాయిదాతేది: 21-6-2023

పి.వి.శ్రీమన్నారాయణ,
పిటీషనరు తరఫు అడ్వకేటు, తెనాలి.

ప్రకటన

నా క్లయింటు అయిన గుంటూరు సిటీ, పాత గుంటూరు, డోర్ నెం. 15-6-57/2 కాపురస్తులు పోలక వెంకట నారాయణరెడ్డి తండ్రి : అంకిరెడ్డి వలన సమాచారం పొంది ఈ ప్రకటన ద్వారా తెలియజేయునది ఏమనగా,

నా క్లయింటు అయిన పోలక వెంకట నారాయణరెడ్డి గారు గుంటూరు వాస్తవ్యులైన షేక్ ఇస్మాయిల్ తండ్రి షేక్ ఖాలీల్ సాహెబ్ గారి ద్వారా విక్రయం పొందిన ఖాళీ నివేశన స్థల విక్రయ లింక్ దస్తావేజు అయిన పుట్టా తిరుపతిరావు తండ్రి వెంకటేశ్వర్లు 1845/1999 ఒరిజినల్ డాక్యుమెంట్ ఫైనాన్స్ ఆఫీసులో పని నిమిత్తం పల్నాడు జిల్లా, కారంపూడి మండలం, కారంపూడి టౌన్‌లోని బస్టాండ్ సెంటర్‌లో జారి పడిపోయినది. ఎంత వెదికిననూ దొరకలేదు. అందువలన పైన తెలిపిన డాక్యుమెంట్ నెం. 1845/1999 తేది : 25-03-1999 ఒరిజినల్ ఎవరికైనా దొరికిన యెడల నా క్లయింట్ అడ్రస్‌కు గానీ, లేదా ఈ క్రింది చిరునామాకు గానీ అందజేయవలసినదిగా కోరుచున్నాము.

దివాకరుని రాధాకృష్ణమూర్తి,
అడ్వకేట్ - నోటరీ,
శ్రీరామ్‌పురం,
గురజాల- 522415.
పల్నాడుజిల్లా, ఎ.పి.
సెల్ : 9966328299

విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

తెల్లబాడులో అంబేద్కర్ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి - నూజెండ్ల

మండలంలోని తెల్లబాడులో బుధవారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని మాల మహానాడు జాతీయ అధ్యక్షులు జి.చెన్నయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాల మహానాడు పల్నాడు జిల్లా ఇన్‌ఛార్జి కె.పౌల్ ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు కె.సుధాకర్, జి.కోటేశ్వరరావు, డాక్టర్ జి.చార్వాక కె.బాబురావు, బి.నాగేశ్వరరావు, కె.వెంకట్రావు, పి.పాపారావు పాల్గొన్నారు.

కొండెక్కిన చికెన్ ధరలు

ప్రజాశక్తి - రెంటచింతల

బాయిలర్ కోడి ధర కొండెక్కింది. గత నెలలో కిలో రూ.180 ఉండగా ప్రస్తుతం రూ.260కు చేరింది. స్కిన్‌లెస్ అయితే రూ.20 అదనం. గతేడాది వేసవిలో ఎండలకు ఎక్కువ కోళ్లు మృత్యువాత పడ్డాయి. దీంతో కోళ్ల రైతులు భారీగా నష్టపోయారు. ప్రస్తుతం ఉన్న ధర గత రెండేళ్లలో ఎప్పుడూ లేదు. గతంలో కోడి పిల్లలు రేటు హేచరీస్‌లో రూ.20 వరకుంటే ప్రస్తుతం రూ.34కు చేరుకుంది. భారీగా పెరిగిన దాణా ధరలతో గుడ్డు ఉత్పత్తి వ్యయం రూ.ఐదు అవుతున్నా ఉష్ణోగ్రతల వల్ల త్వరగా పాడయ్యే అవకాశం ఉన్న దృష్ట్యా రూ.4.75కే విక్రయిస్తున్నారు. అయితే చికెన్‌కు మాత్ర డిమాండ్‌కు తగ్గ సరఫరా లేకపోవడం, అధిక ఉష్ణోగ్రత వలన కోడి కిలోన్నరకు మించి పెరగకపోవడంతో ధర పెరిగినట్లు నిర్వాహకులు చెబుతున్నారు.

విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

కొనసాగుతున్న మజ్జిగ చలివేంద్రం

ప్రజాశక్తి-సత్తెనపల్లి

పుచ్చలపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం (పిఎస్‌వికె) ఆధ్వర్యంలో స్థానిక పాత బస్టాండ్ సెంటర్లో ఏర్పాటు చేసిన మజ్జిగ కేంద్రం 11వ రోజుకు చేరింది. బుధవారం మజ్జిగ పంపిణీని దాతలు అమరావతి డ్రైఫ్రూట్స్ నిర్వాహకులు పొట్టి వీరేశం, మహేశ్వరి ప్రారంభించారు. పిఎస్‌వికె నిర్వాహకులు పి.సూర్యప్రకాశరావు, డి.విమల, కె.నాగేశ్వరరావు, కె.వెంకట్ నారాయణ, కె.జగన్మోహన్‌రావు పాల్గొన్నారు.

సాతులూరులో నేడు ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి-నాదెండ్ల

మండలంలోని సాతులూరులో తెలుగు యువత ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ విగ్రహాన్ని మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు గురువారం సాయంత్రం ఆవిష్కరిస్తారని టిడిపి నాయకులు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు జీవీ ఆంజనేయులు, నరసరావుపేట, మాచర్ల నియోజకవర్గ ఇన్‌చార్జులు డాక్టర్ చదలవాడ అరవిందబాబు జూలకంటి బ్రహ్మారెడ్డి పాల్గొంటారని తెలిపారు.

విత్తనంపై ధర పెత్తనం..

- తరచూ పెంచేస్తున్న వ్యాపారులు
- డిమాండ్ పేరుతో ప్యాకెట్‌కు రూ.700 వరకూ పెంపు
- నియంత్రణలో అధికారులు విఫలం
- ఎకరాకు రూ.7 వేల వరకూ నష్టపోతున్న రైతులు

తమ కంపెనీ విత్తనాలు తెగుళ్లను తట్టుకుని మంచి దిగుబడిని ఇచ్చాయని, ఈ విత్తనాలను సాగుచేస్తే లాభాలే లాభాలని గ్రామాల్లో మిర్చి విత్తన కంపెనీలు చెవులకు చిల్లులు పడేలా ప్రచారం ఊదర గొడుతోంది. అది విన్న రైతులు ఆ విత్తనాలను ముందుగానే కొనేయాలని దుకాణాలకు వెళ్తుండగా ధరలను పెంచి రైతుల జేబులకు వ్యాపారులు చిల్లులు పెడుతున్నారు. కృత్రిమంగా పెంచుతున్న ధర వల్ల రైతులకు ఎకరాకు ప్రస్తుతం రూ.ఏడెనిమిది వేల వరకూ నష్టపోతున్నారు.

ప్రజాశక్తి - చిలకలూరిపేట

ఇతర పంటలతో పోలిస్తే గతేడాది మిర్చి సాగుకు ఆశాజనకంగా ఉండడంతో ఈ ఏడాది ఎక్కువ మంది రైతులు మిర్చిసాగుకు ఆసక్తిగా ఉన్నారు. మండలంలో గత సీజన్‌లో 6250 ఎకరాల వరకూ మిర్చి సాగవగా ఈ ఏడాది 7 వేల ఎకరాలు దాటుతుందని అంచనా. ఎకరాకు 10-12 ప్యాకెట్ల (ఒక్కో ప్యాకెట్ 100 గ్రాములు) విత్తనాలు అవసరం అవుతాయి. సాధారణంగా జులై ఆఖరులో మిర్చి సాగు మొదలవుతుంది. అయితే కంపెనీలు చేస్తున్న ప్రచారం, విత్తన మార్కెట్‌లో హడావుడి కారణంగా భవిష్యత్‌లో ధరలు ఇంకా పెరుగుతాయేమో, ఆ కంపెనీ విత్తనాలు అయిపోతాయేమోనని రైతులు కంగారు పడుతున్నారు. ఈ కంగారునే వ్యాపారులు అసరగా చేసుకుని విత్తన ధరలు అమాంతం పెంచేస్తున్నారు.

విత్తన విక్రయాలు 10-15 రోజుల కిందటే మొదలవగా రోజులో రకంగా ధర ఉంటోంది. తమ కంపెనీ విత్తనాలకు దోమ, ముడత తెగుళ్ల రావని, గత సీజన్‌లో మంచి దిగుబడి వచ్చిందని ఒక కంపెనీ ప్రతినిధులు ప్రచారం చేసుకుంటున్నారు. పైగా డీలర్ల వద్ద మా కంపెనీ విత్తనాల బుకింగ్ ముగించామని, త్వరగా కొనుక్కోవాలంన్నారని రైతులు చెబుతున్నారు. ఈ క్రమంలో తొలుత విత్తనాల ప్యాకెట్ ధర రూ.1200 ఉండగా అది క్రమంగా పెరుగుతూ రూ.2 వేలకు చేరింది. ఇదే ధరకు రైతు కొనాల్సి వస్తే ఎకరాకు విత్తనాల కొనుగోలు ఖర్చే రూ.20 వేలకు పైగా ఉంటుంది.

విత్తన ధరలు మార్కెట్‌లో ఇలా పెరుగుతున్నా అధికారులు నియంత్రించడం లేదనే విమర్శలు వస్తున్నాయి. మరోవైపు విత్తనాలను రైతు భరోసా కేంద్రాల ద్వారా సరఫరా చేయాలనే విధానమూ సరిగా అమలు కావడం లేదు. మండలానికి 52-55 కిలోల వరకూ మిర్చి విత్తనాల అవసరం ఉంటుందని తాము ఏపీ సీడ్స్‌కు ఇండెంట్ పెట్టామని, రైతులు ఎక్కువగా అడుగుతున్న రకం విత్తనాలు 6.250 కిలోలు కావాలని కోరినా అవి రాలేదని హార్టికల్చర్ అధికారులు చెబుతున్నారు. 10 గ్రాముల ప్యాకెట్ ధర రూ.1300 ఉంటుందని, రైతులు తమను సంప్రదిస్తే తెప్పిస్తామని అంటున్నారు. అయితే ఇదంతా పేరుకేనని, ఆ కంపెనీ విత్తనాలకు డిమాండ్ పెరగడంతో వారే బ్లాక్ చేసి అధిక ధరలకు అమ్ముతున్నారని రైతులంటున్నారు.

ఆర్బీకేల్లో ఇస్తే ఈ తిప్పలుండవు

ప్రతిఏటా 20-25 ఎకరాలు మిర్చి సాగు చేస్తున్నా. మూడేళ్ల కిందట ఎకరాకు 20 క్వింటాళ్ల చొప్పున దిగుబడి రాగా గతేడాది 10-12 క్వింటాళ్లే వచ్చింది. 10-15 శాతంగా ఉండాల్సిన తాలు 25-30 శాతం వరకూ ఉంది. ఏదో కంపెనీ విత్తనాలు బాగాన్నాయని చెబితే కొనడానికి వెళ్లా. అప్పటికే రూ.1200 నుండి రూ.1600కు పెంచారు. మా పొలం పక్కనే పొలానికి చెందిన రైతు వెళ్లే సరికి అది రూ.2 వేలైంది. రైతు భరోసా కేంద్రాల ద్వారా ఈ విత్తనాలు ఇప్పించగలిగితే మాకు కష్టాలు ఉండవు.

తిరుమలశెట్టి సుబ్బారావు, రైతు, గంగన్నపాలెం

కూలీలతో మాట్లాడుతున్న లక్ష్మీశ్వరరెడ్డి

ఉపాధి హామీ పరిరక్షణ కోసం 29న ధర్నా

ప్రజాశక్తి - పెదకూరపాడు

ఉపాధి హామీ చట్ట పరిరక్షణ కోసం ఈనెల 29న కలెక్టరేట్ వద్ద ధర్నాను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి ఎ.లక్ష్మీశ్వరరెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు అబ్బరాజుపాలెం, పెదకూరపాడులో ఉపాధి హామీ పని ప్రదేశాలను ఆయన బుధవారం సందర్శించి కూలీలతో మాట్లాడారు. వ్యవసాయంలో పనులు తగ్గిన నేపథ్యంలో ఉపాధి హామీ అవసరం మరింత పెరిగిందని, మరోవైపు ఈ చట్టం నిర్వీర్యానికి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కుట్రలు చేస్తోందని చెప్పారు. ఈ క్రమంలో చట్టం పరిరక్షణ, పటిష్ట అమలు కోసం చేపట్టే ఉద్యమాల్లో కూలీలు భాగస్వామ్యం కావాలని కోరారు.

బీసీలకు ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి

మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాస్

విలేకర్లతో మాట్లాడుతున్న యరపతినేని శ్రీనివాసరావు

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

బీజీలకు గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని మాజీ యరపతినేని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. స్థానిక టిడిపి కార్యాలయంలో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఈనెల 20న కాసు బ్రహ్మానందరెడ్డి వర్ధంతి సందర్భంగా ఆరోజును బీసీ డే గా ప్రకటించడాన్ని ఖండిస్తున్నామన్నారు. మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి రోజున బీసీ డే పెట్టాలేగాని, బ్రహ్మానందరెడ్డి వర్ధంతిని ఎలా ప్రకటిస్తారని ప్రశ్నించారు. ఆ ప్రకటన చేసేటప్పుడు మీ వెనక కనీసం 10 మంది బీసీ నాయకులైనా లేరని ఎద్దేవ చేశారు. జంగా కృష్ణమూర్తి, దేవళ్ల రేవతి, కూడా లేరన్నారు. కాసు బ్రహ్మానందరెడ్డి మీద అంత ప్రేమ ఉంటే కనీసం ఆయన విగ్రహానికి రంగులైనా వేయించలేక పోయారా? అని ప్రశ్నించారు. వైసిపి అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలో 11 మందిని హత్య చేయగా అందులో ఐదుగురు బీసీలని, మీ మైనింగ్ అక్రమాల వల్ల ఎనిమిది మంది చిన్నారులు ప్రాణాలు కోల్పోగా వారిలోనూ ముగ్గురు బీసీలని చెప్పారు. పిడుగురాళ్లలో బీసీలైన వైద్యులపై ఎమ్మెల్యే అనుచరులు, వ్యక్తిగత గన్‌మెన్ అరాచకం సిగ్గుచేటన్నారు. నియోజకవర్గంలో సరైన రోడ్లు లేవని, 80 శాతం పూర్తయిన టిడ్కో ఇళ్లను పూర్తి చేయలేదని విమర్శించారు. పంట నష్టంపై అంచనాలే లేవని, 33 ప్రాంతాల్లో అక్రమ మైనింగ్‌పై జిల్లా అధికారులు ఎందుకు స్పందించరని ప్రశ్నించారు. బెల్ట్ షాపులు నడుస్తున్నా పిడుగురాళ్ల సెబ్ సీఐ కొండారెడ్డి పట్టించుకోవడం లేదని, పైగా టిడిపి వారిపై అక్రమ కేసులు పెడుతున్నారని అన్నారు. వేల ఎకరాలు వైసిపి నాయకులు కబ్జా చేసి బ్యాంకులో తనఖాలు పెట్టి రూ.కోట్ల రుణాలు పొందుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు పి.కాంతారావు, సురేష్ పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో ప్రధాన పైరుకు మేలు

ప్రజాశక్తి - బెల్లంకొండ

తొలకరి వర్షానికి ముందుగా భూమిలో నవధాన్యాలు ఆహార ధాన్యాలు, పప్పుధాన్యాలు, నూనె గింజలు, సుగంధ ద్రవ్యాలు, ఆకుకూరలు కూరగాయలు, తీగజాతి, పచ్చిరొట్ట విత్తనాలు సాగుచేసి కలియదున్నడం ద్వారా భూసారం పెరుగుతుందని డివిజన్ మాస్టర్ ట్రైనర్ సైదయ్య సూచించారు. మండలంలోని మన్నెసుల్తాన్‌పాలెంలో బుధవారం రైతులకు సదస్సు నిర్వహించారు. మిర్చి సాగు చేసే రైతులు నవధాన్య సాగు చేస్తే తామర పురుగును తట్టుకునే శక్తి మొక్కకు లభిస్తుందని, భూమిలో కర్బన శాతం పెరిగి రసాయన ఎరువులు వినియోగ అవసరమూ తగ్గుతుందని వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ దారం వెంకట నరసమ్మ రమణారెడ్డి, సాయికిరణ్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సైదా, ఉత్తమరెడ్డి, లక్ష్మీ పాల్గొన్నారు.

సమన్వయంతో పని చేయాలి

మంత్రి విడదల రజిని

వెంకటపాలెంలో సిఎం సభ ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి - తుళ్లూరు

తుళ్లూరు మండలం వెంకటపాలెంలో 26 వ తేదీన నవరత్నాలు పేదలందరికీ ఇళ్ల పథకం ఇంటి పట్టాలు రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్. జగన్ మోహన్ రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేసే కార్యక్రమ బహిరంగ సభ ఏర్పాట్లను బుధవారం సాయంత్రం వెంకటపాలెంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి విడదల రజిని, జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి, జిల్లా ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్, బాపట్ల పార్లమెంట్ సభ్యులు నందిగం సురేశ్, శాసన మండలి సభ్యులు లేళ్ల అప్పిరెడ్డి, తలశిల రఘురామ్, సిఆర్డిఏ అడిషనల్ కమిషనర్ ఆలీం భాష, తాడికొండ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కత్తెర సురేశ్ కుమార్ పరిశీలించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి సభా వేదిక వద్ద సంయుక్త కలెక్టర్ జి. రాజ కుమారి, అసిస్టెంట్ కలెక్టర్ శివనారాయణ శర్మతో కలసి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సభా స్థలి ప్రాంతంలో వేదిక, గ్యాలరీల నిర్మాణం, పార్కింగ్ ప్రదేశాలలో చేపట్టాల్సిన చర్యలపై అధికారులతో చర్చించి సూచనలు అందించారు. భారీ ఎత్తున ప్రజలు పాల్గొనే అవకాశం ఉన్నందున అందుకు తగ్గట్లుగా ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలన్నారు. వేసవి దృష్ట్యా తాగునీరు అందుబాటులో వుంచాలని, పారిశుధ్య ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. అధికారులందరూ తమకు కేటాయించిన విధులను తప్పకుండా పాటించి ముఖ్యమంత్రి వర్యుల పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ యం. వెంకట శివరామి రెడ్డి, ట్రైనీ కలెక్టర్లు మోవిడి వాణి, సాయిశ్రీ, రెవెన్యూ డివిజనల్ అధికారి ప్రభాకర రెడ్డి, డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్, సాంఘీక సంక్షేమ శాఖ డీడీ మధుసూధన రావు, జిల్లా వ్యవసాయ ఆధికారి నున్నా వెంకటేశ్వర్లు తదితరులు ల్గొన్నారు

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి విడదల రజిని, ఎంపి నందిగం, కలెక్టర్ తదితరులు

రేపు ట్రాఫిక్ మళ్లింపు

రాజధానిలో సిఎం పర్యటనతో పోలీసుల నిర్ణయం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం వెంకట పాలెంలో శుక్రవారం సిఎం జగన్ సభ దృష్ట్యా జాతీయ రహదారిపై ట్రాఫిక్ మళ్లిస్తున్నట్టు గుంటూరు రేంజి ఐజి పాలరాజ్ తెలిపారు. శుక్రవారం ఉదయం 4 గంటల నుంచి సాయంత్రం 4:00 గంటల వరకు కింది ట్రాఫిక్ మళ్లింపులు భారీ వాహనాల నిలిపివేత వివరాలను ఆయన బుధవారం ఒకప్రకటనలో తెలిపారు. చెన్నై వైపు నుండి విజయవాడ మీదుగా విశాఖపట్నం వైపు మరియు ఇబ్రహీంపట్నం, నందిగామ, వైపుకు వెళ్ళు భారీ గూడ్స్ వాహనములు ఒంగోలు జిల్లా త్రోవగుంట వద్ద నుండి చీరాల, బాపట్ల, రేపల్లె- అవనిగడ్డ- పామర్రు, గుడివాడ హనుమాన్ జంక్షన్ మీదుగా విశాఖపట్నం మరియు ఇబ్రహీంపట్నం వైపుకు మళ్ళిస్తున్నట్టు తెలిపారు. చెన్నై నుండి హైదరాబాద్ వైపు వెళ్ళే వాహనాలు మేదరమెట్ల, అద్దంకి, పిడుగురాళ్ళు, నడికుడి, మిర్యాలగూడ, నల్గొండ, నార్కెట్ పల్లి మీదుగా హైదరాబాద్ వెళ్లాలని అన్నారు. చిలకలూరిపేట నుండి విశాఖపట్నం వైపు వెళ్ళే వాహనాలను పెదనందిపాడు , కాకుమాను, పొన్నూరు , చందోలు, చెరుకుపల్లి , భట్టిప్రోలు, పెనుమూడి బ్రిడ్జ్ మీదుగా అవనిగడ్డ, పామర్రు, గుడివాడ హనుమాన్ జంక్షన్ మీదుగా విశాఖపట్నం వైపు మళ్లించనున్నట్టు తెలిపారు. చెన్నై నుండి విశాఖపట్నం వెళ్ళే వాహనాలను బోయపాలెం క్రాస్ వద్ద నుండి ఉన్నం గ్రామం, ఏ.బి.పాలెం వల్లూరు, పాండ్రపాడు, పొన్నూరు, చందోలు, చెరుకుపల్లి , భట్టిప్రోలు , పెనుమూడి బ్రిడ్జ్ మీదుగా అవనిగడ్డ, పామర్రు గుడివాడ హనుమాన్ జంక్షన్ మీదుగా విశాఖపట్నం వైపు మళ్లించనున్నట్టు తెలిపారు. గుంటూరు నుండి విశాఖపట్నం వెళ్ళే వాహనాలను బుడంపాడు మీదుగా తెనాలి, వేమూరు, కొల్లూరు, వెల్లటూరు జంక్షన్ ,పెనుమూడి బ్రిడ్జ్ మిధుగా అవనిగడ్డ, పామర్రు హనుమాన్ జంక్షన్ మీదుగా విశాఖపట్నం వైపు వెళ్లాలని కోరారు. విశాఖపట్నం వైపు నుండి చెన్నై వైపు వెళ్ళు లారీలు, భారీ వాహనములు హనుమాన్ జంక్షన్ వద్ద నుండి గుడివాడ , పామర్రు - అవనిగడ్డ రేపల్లె- బాపట్ల .చీరాల, త్రోవగుంట, ఒంగోలు మీదుగా మళ్ళించనున్నట్టు తెలిపారు. రాజమండ్రి నుండి హైదరాబాద్ వైపు వెళ్ళు వాహనములు, దివాన్ చెరువు, ధవళేస్వరం బ్రిడ్జి, కొవ్వూరు , జంగారెడ్డి గూడెం , అస్వరావు పేట , సత్తుపల్లి మీదుగా మళ్ళించడం జరుగుతుందన్నారు. గన్నవరం వైపు నుండి హైదరాబాద్ వెళ్ళు వాహనములు కేసరపల్లి , ముస్తాబాద్,ఇన్నర్ రింగ్ రోడ్ , పైపుల రోడ్, ఇబ్రహింపట్నం వైపుకు మళ్ళించడం జరుగుతుందన్నారు. హనుమాన్ జంక్షన్ వైపు నుండి హైదరాబాద్ వెళ్ళు వాహనములు గన్నవరం గాంధి బొమ్మ, ఆగిరిపల్లి, జి కొండూరు, ఇబ్రహీంపట్నం వైపు మళ్ళించడం జరుగుతుందన్నారు.

పెదకాకాని వైపు నుండి తుళ్లూరు మండలం వెంకట పాలెం వచ్చే వారి వాహనాల పార్కింగ్‌కు తక్కెళ్ళపాడు, ఉప్పలపాడు, నంబూరు, అగాతార పాడు, తక్కెళ్ళ పాడు వైపు నుంచి వచ్చే వాహనాలు కుప్పరావు నుంచి కంతేరు తాటికొండ పెద్దపరిమి తుళ్లూరు రాయపూడి సిడి యాక్సెస్ రోడ్డు రావాలన్నారు. మంగళగిరి టౌన్, ఖాజా, ఆత్మ కూరు, పెడవడ్లపుడి, వైపు నుండి వచ్చే వాహనాలు నిడమర్రు,కురకల్లు,విట్ కాలేజీ జంక్షన్, అసెంబ్లీ వెనుక నుండి,వెలగపూడి చర్చ్ సెంటర్ మీదుగా సీడ్ యాక్సిస్ కి రావాలన్నారు. తాడేపల్లి నుంచి వచ్చే వాహనాలు ఎయిమ్స్ ఆస్పత్రి లోపల నుంచి మంగళగిరి బ్రిడ్జి డాన్ బాస్కో స్కూలు ఎర్రబాలెం క్రిష్ణాయపాలెం, మండడం, మీదుగా వెలగపూడి చర్చ్ దగ్గర కుడివైపుకు తీసుకొని సీడ్ యాక్సెస్ 9 జంక్షన్‌కు వచ్చి సీడ్ యాక్సెస్ రోడ్డు కి రావాలన్నారు. విజయవాడ వైపు నుంచి వాహనాలు ఉండవల్లి, ఉండవల్లి కేవ్స్, పెనుమాక మీదుగా కృష్ణాయ పాలెం, దాటాక కుడి వైపు మెటల్ రోడ్డులోకి తీసుకొని, వెంకటపాలెం పార్కింగ్ ప్లేస్ రావాలని కోరారు. విజయవాడ వైపు నుంచి వచ్చే వాహనాలు విజయవాడ ఎయిమ్స్ పక్కగా బ్రహ్మానందపురం రైల్వే గేటు నులకపేట మీదుగా ఉండవల్లి సెంటర్, ఉండవల్లి గుహలు, పెనుమాక కృష్ణయ్యపాలెం దాటాక కుడివైపుకు తీసుకొని వెంకటపాలెం పార్కింగ్‌కి రావాలని ఐజి కోరారు.

కృష్ణాడెల్టాను ఆధునీకరించాలి

ప్రజాశక్తి - మంగళగిరి

కృష్ణాడెల్టాను ఆధునీకరించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్నా శివశంకరరావు డిమాండ్ చేశారు. బుధవారం మంగళగిరి నియోజకవర్గంలో రైతు, వ్యాకాస, కౌలు రైతు సంఘం బాధ్యుల సమావేశం టిప్పర్ల బజార్ లోని రైతు సంఘం కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశానికి జొన్నా శివశంకర్ రావు అధ్యక్షత వహించి మాట్లాడారు. మంగళగిరి నియోజకవర్గంలో రైతులు కౌలు రైతులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. దుగ్గిరాల మండలంలో హైలెవల్ ఛానల్ పంట కాలువలకు నీళ్లు సరిగా ప్రవహించడం లేదని అందువల్ల హై లెవెల్ ఛానల్ ను బాగు చేయాలని తెలిపారు. కౌలు రైతులకు కౌలు కార్డు లేకపోవడం వల్ల ప్రభుత్వం నుంచి వచ్చే ఎటువంటి సదుపాయం వారికి అందటం లేదన్నారు. యజమానితో సంబంధం లేకుండా కౌలు కార్డులు మంజూరు చేయాలని కోరుతూ జూన్ 12న ఆందోళన చేపట్టనున్నట్లు తెలిపారు. వ్యకాస జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు మాట్లాడుతు ఎంటిఎంసి పరిధిలో విలీన గ్రామాలోల వ్యవసాయ కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వం పట్టణ ప్రాంతం పేరుతో ఉపాధి హామీ పనులను ఎత్తివేసిందని, దీనితో వ్యవసాయ కార్మికులకు పనులు లేక నానా అవస్థలు పడుతున్నారని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే పట్టణ ప్రాంతాల్లో ఉపాధి పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. దుగ్గిరాల మండలంలో ఉపాధి కార్మికులకు నెలలు తరబడి వేతనాలు బకాయి ఉంటున్నాయని వీటిని వెంటనే చెల్లించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జెట్టి బాలరాజు, నాయకులు బి.కోటేశ్వరి, అజయ్, సీతామహాలక్ష్మి, శివయ్య, రైతు సంఘం నాయకులు టి .ప్రసాద్ రెడ్డి, వై.బ్రమేశ్వరరావు, టీ .బక్కిరెడ్డి, కౌలు రైతు సంఘం నాయకులు కృష్ణ, ,బి. అమ్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జొన్నా శివశంకరరావు

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

- నగర అదనపు కమిషనర్ పెద్ది రోజా

ప్రజాశక్తి-గుంటూరు

జగనన్న కాలనీల్లో ఇళ్ళ నిర్మాణ పనుల కాంట్రాక్టు పొందిన కాంట్రాక్టర్లు పనులు వేగవంతం చేయాలని, అవసరమైతే అదనపు కార్మికులను ఏర్పాటు చేసుకోవాలని, హౌసింగ్, జిఎంసి ఇంజినీరింగ్ అధికారులు ప్రతి రోజూ పర్యవేక్షణ చేయాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ పెద్ది రోజా ఆదేశించారు. బుధవారం నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశాల మేరకు జిఎంసి కాన్ఫరెన్స్ హాల్‌లో ఇంజినీరింగ్, హౌసింగ్ డిపార్ట్మెంట్, ఎమినిటి కార్యదర్శులతో జగనన్నకాలనీల్లో ఇళ్ళ నిర్మాణ పనులపై అదనపు కమిషనర్ సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు కమిషనర్ తొలుత లే అవుట్ల వారీగా వారిగా ఇళ్ళ నిర్మాణం ఏ మేరకు పూర్తి అయ్యింది, గ్రౌండ్ లెవల్ ఎన్ని ఉన్నాయి, మౌలిక వసతులు, బిల్లుల చెల్లింపు, ఇసుక, సిమెంట్, ఇనుము లభ్యత తదితర అంశాలను అధికారులను, ఏమినిటి కార్యదర్శులను అడిగి తెలుసుకొని మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణపనులు వేగంగా జరగాలని, నిర్మాణ పనుల కాంట్రాక్ట్ పొందిన కాంట్రాక్టర్లు అవసరమైన కార్మికులను సిద్ధం చేసుకోవాలన్నారు. ప్రతి లే అవుట్ నుండి కాంట్రాక్టర్ ప్రతి రోజు నిర్దేశిత లక్ష్యానికి అనుగుణంగా పనులు చేయాలని, నోడల్ అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. లే అవుట్‌ల వారీగా ఎప్పటికప్పుడు పనుల పురోగతిపై నివేదిక ఇవ్వాలని, ఏ సమస్య ఎదురైనా అధికారులు సమన్వయంతో పరిష్కరించి పనుల వేగవంతానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. లే అవుట్లలో అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తున్నామని, లబ్దిదారులు ఇళ్ల నిర్మాణం చేసుకునేలా సచివాలయ కార్యదర్శులు, నోడల్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. సమావేశంలో హౌసింగ్ ఈఈ. శంకరరావు, జిఎంసి ఈ.ఈ. కొండారెడ్డి, నగరపాలక సంస్థ, హౌసింగ్ డి.ఈ.ఈ.లు, ఏ.ఈ.లు పాల్గొన్నారు.

సమీక్షలో మాట్లాడుతన్న అదనపు కమిషనర్ రోజా

తండ్రీకొడుకులపై పీడీ చట్టం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గంజాయి, మత్తు పదార్థాలు విక్రయించి మరణాయుధాలతో ప్రజలను భయపెడుతున్న ఇద్దరు వ్యక్తులపై పిడి చట్టం ఉపయోగించి వారిని రాజమండ్రి జైలుకు తరలించినట్టు జిల్లా ఎస్‌పి ఆరీఫ్ హఫీజ్ తెలిపారు. గుంటూరు చెందిన తండ్రి కొడుకులైన మందా ఆదాం, మందా డేవిడ్ గత కొంత కాలంగా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని తెలిపారు. కొండావెంకటప్పయ్య కాలని 1వ లైన్‌లో నివాసముండే ఆదాం, డేవిడ్‌లపై గుంటూరులోని వివిధ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి అమ్మకం కేసులలో నిందితులుగా ఉన్నారని తెలిపారు. గంజాయి మరియు మత్తు పదార్థాలను అమ్మడం ఎన్నిసార్లు చెప్పినా ప్రజల యొక్క దైనందిన కార్యక్రమాలకు శాంతి భద్రతలకు అడ్డు కలిగిస్తుండడంతో పిడి చట్టం ఉపయోగించినట్టు తెలిపారు. ఎన్ని విధాలుగా కౌన్సిలింగ్ ఇచ్చిన వారి ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు.

ట్రాఫిక్ డిఎస్‌పిగా బాలసుందరరావు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు ట్రాఫిక్ డిఎస్పీ గా బాల సుందర రావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో ఆయన గుంటూరుకు బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం జిల్లా ఎస్‌పి ఆరిఫ్ హఫీజ్‌ను ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు. ఎస్సైగా సర్వీస్ ప్రారంభించి ఎస్సైగా ,సిఐ.గా , గుంటూరు, నెల్లూరు ప్రకాశం జిల్లాలో పనిచేసి అనంతరం డిఎస్పీగా ప్రమోషన్ పొంది గుంటూరు జిల్లాలో స్పెషల్ బ్రాంచ్ డిఎస్పీగా ఇంటలిజెన్సీ సెక్యూరిటీలో విధులు నిర్వహించారు.

ఎస్‌పి ఆరీఫ్ హఫీజ్‌ను కలిసిన బాల సుందరరావు

మాట్లాడుతున్న కేసన శంకరరావు

బిసిల అభ్యున్నతిపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు

బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు

ప్రజాశక్తి-గుంటూరు : బీసీల స్థితిగతులపై అధ్యయనం చేయటానికి కేంద్ర ప్రభుత్వం నియమిస్తున్న కమిషన్లు కాలయాపన కోసమేనని, వాటి సిఫార్సులు అమలు చేసే చిత్తశుద్ధి లేదని బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు అన్నారు. బుధవారం స్థానిక చుట్టుగుంటలోని బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర యువజన కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిసిల స్థితిగతులపై ఇప్పటి వరకూ జాతీయ స్థాయిలో కాకా కాలేల్కర్, బిపి మండల్ కమిషన్లు రెండు నియమించారని, వాటి ముఖ్య ఉద్దేశం కాలయాపన కోసమేనని అన్నారు. ఓబీసీ నాయకులు, ప్రజా సంఘాల ఒత్తిడి మేరకే కంటితుడుపుగా కమిషన్లు వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మోడీ అధికారంలోకి వస్తే బిసిలకు న్యాయం జరుగుతుందని 52 శాతం మంది ప్రజలు ఆశించారని, కానీ వారి ఆశలన్నీ అడియాశలు అయ్యాయన్నారు. ఆచరణ సాధ్యమయ్యే ఓబీసీ కులాల జనాభా లెక్కలు తీయుట, కేంద్ర రాష్ట్రాలలో ఓబీసీల మంత్రిత్వ శాఖ ఏర్పాటు, క్రిమిలేయర్ తొలగింపు, కేంద్ర సర్వీస్‌లలో 27శాతం విద్యా ఉద్యోగాలలో రిజర్వేషన్లను తొమ్మిదవ షెడ్యూల్లో పొందుపరచుట, ఉద్యోగ ప్రమోషన్లలో ఎస్సీ అండ్ ఎస్టీల వలే సదుపాయం కల్పించుట వంటి డిమాండ్స్‌ను తక్షణమే అమోదించి, అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి కుమ్మర క్రాంతి కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లే ఈశ్వరరావు, బీసీ గుంటూరు అర్బన్ అధ్యక్షు లు ఉప్పుటూరి పేరయ్య తదితరులు పాల్గొన్నారు.

వినుకొండ నూతన సిఐగా సాంబశివరావు

ప్రజాశక్తి - వినుకొండ

సాధారణ బదిలీల్లో భాగంగా పట్టణ సిఐ అశోక్ కుమార్‌ను గుంటూరు రేంజ్ కార్యాలయానికి బదిలీ చేశారు. ఆయనస్థానంలో నెల్లూరు జిల్లా కలిగిరిలో విధులు నిర్వహిస్తున్న సాంబశివరావును వినుకొండకు బదిలీ చేయగా ఆయన బుధవారం ఉదయం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఉమ్మడి గుంటూరు జిల్లాలోని మాచర్ల, దాచేపల్లి, మాచవరం, సత్తెనపల్లి, రేపల్లె పలు మండలాల్లో ఎస్ఐగా సాంబశివరావు పని చేశారు.

ఈపూరు ఎస్ఐ బదిలీ

ప్రజాశక్తి-ఈపూరు

సాధారణ బదిలీల్లో భాగంగా ఈపూరు ఎస్ఐ విప్పర్ల వెంకటరావు పెదకూరపాడుకు బదిలీ చేశారు. దీంతో బండ్లమోటు ఎస్ఐ జె.బలరామ్‌రెడ్డికి ఈపూరు పోలీస్‌స్టేషన్ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

పనుల పరిశీలనలో భాగంగా సిబ్బందితో మాట్లాడుతున్న సిఇఒ

ఉపాధి హామీ పనులను పెంచండి : జెడ్‌పి సిఇఒ

ప్రజాశక్తి-అమరావతి

మండలంలోని ధరణికోటలో ఉపాధి హామీ పనులను జిల్లా పరిషత్ సిఇఒ మోహన్‌రావు, ఎంపిడిఒ పి.మాధురి బుధవారం పరిశీలించారు. కూలీలను పెంచి ఎక్కువ పనులు చేయించాలని సిబ్బందికి జెడ్‌పి సిఇఒ సూచించారు. అనంతరం పలు గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆయనవెంట ఎపిఒ సుభావతి, పంచాయతీ కార్యదర్శి అబ్దుల్ రజాక్ ఉన్నారు.

మాట్లాడుతున్న అమలకుమారి

ఎస్సీ రైతులకు ప్రోత్సాహాలపై అవగాహన

ప్రజాశక్తి-అమరావతి : ప్రకృతి వ్యవసాయంలో చేసే ఎస్సీ రైతులకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా అందించే ప్రోత్సాహాలపై మండలంలోని అత్తలూరులో బుధవారం అవగాహన కల్పించారు. వివిధ అంశాలపై ఎస్సీ కార్పొరేషన్ ఎమ్‌డి చిన్నరాముడు వివరించారు. జిల్లా ఈడీ ప్రేమకుమారి, రైతు సాధికార సంస్థ ప్రతినిధి టియల్ రాము, ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ అమలకుమారి పాల్గొన్నారు.

పర్యావరణ హిత జీవనశైలిపై ప్రతిజ్ఞ

ప్రజాశక్తి -మాచవరం : పర్యావరణ హిత జీవనశైలిని పెంపొందించుకోవాలని ఎంపిపి డి.అమ్ములమ్మ లక్ష్మిరెడ్డి కోరారు. దీనిపై ఫారెస్ట్ అధికారుల ఆధ్వర్యంలో మండలంలోని మొర్జంపాడు సచివాలయంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపిపి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చెట్లు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని, విద్యుత్తు వినియోగంలో పొదుపు పాటించాలని కోరారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ వాడకం తగ్గిస్తామని, పరిసరాల పరిశుభ్రత పాటిస్తామని ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ సాంబయ్య, వెంకటాయపాలెం ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ వెంకటరావు, పాపాయిపాలెం ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రాకేష్, సర్పంచ్, ఎంపిటిసి పాల్గొన్నారు.

ఉత్తీర్ణులు కాకుంటే జీతాలు నిలిపివేత

- డిజిటల్ అసిస్టెట్లకు కలెక్టర్ హెచ్చరిక
- పదేళ్లు దాటిన ఆధార్ కార్డులను అప్‌డేట్ చేయించుకోవాలని ప్రజలకు సూచన

సమీక్షలో పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్, అధికారులు

ప్రజాశక్తి-నరసరావుపేట

'ఆధార్-మీసేవ' సర్వీసులకు సంబంధించి ప్రభుత్వం డిజిటల్ అసిస్టెంట్‌లకు నిర్వహిస్తున్న సాంకేతిక పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించని వారి వేతనాలను నిలిపివేస్తామని పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ చెప్పారు. జిల్లా ఆధార్ కమిటీ సమీక్ష సమావేశం కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 538 గ్రామ వార్డు సచివాలయాల ద్వారా ప్రజలకు సేవలు అందిస్తున్నారని, ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రతి 5 సచివాలయాలకు గాను ఒక సచివాలయంలో ఆధార్ సేవా కిట్లు ఏర్పాటుచేసి, డిజిటల్ అసిస్టెంట్ పర్యవేక్షణలో ప్రజలకు ప్రభుత్వ సర్వీసులను సకాలంలో అందించడానికి విధులను కేటాయించిందని చెప్పారు. ఆధార్ సేవలతో పాటు, ప్రజలకు ఇతర సేవలను అందించేందుకు వీలుగా డిజిటల్ అసిస్టెంట్‌లు సాంకేతిక అంశాలకు సంబంధించి ఉద్యోగంలో భాగంగా డిపార్ట్‌మెంట్ పరీక్షలు నిర్వహించగా ఎక్కువ శాతం మంది ఉత్తీర్ణత సాధించలేకపోతున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు మొత్తం 107 సచివాలయాలకు గాను, గతంలో 62 సచివాలయాలకు ఆధార్ సేవా కిట్లు డిజిటల్ అసిస్టెంట్‌ల ద్వారా అందించామని, కొత్తగా మరో 45 సచివాలయాలకు ఆధార్ కేంద్రాలను వాటికి సంబంధించిన కిట్‌లను అందించామని తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ పనులను చేయాల్సిన సిబ్బందికి పరీక్షలు నిర్వహిస్తుంటే వారు ఉత్తీర్ణత సాధించడం లేదని, అలాంటి డిజిటల్ అసిస్టెంట్‌ల వేతనాలు నిలుపుదలకు ఆదేశించామని ప్రకటించారు. సాంకేతిక అంశాలకు సంబంధించిన పరీక్షల్లో డిజిటల్ అసిస్టెంట్లు ఉత్తీర్ణత సాధించాలని స్పష్టం చేశారు. ఇప్పటి వరకు 180 మంది సాంకేతిక పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించగా, ఇంకా 358 మంది ఉత్తీర్ణత సాధించాల్సి ఉందన్నారు. ఆధార్ కార్డును తీసుకొని పదేళ్లు దాటిన వారు, ఆధార్ కార్డును అప్‌డేట్ చేయించుకోవాలని ప్రజలకు సూచించారు. చేయించుకోని వారి కార్డులు రద్దవుతాయన్నారు. 0-5 ఏళ్ల లోపు చిన్నారులకు ఆధార్ కార్డుల వివరాలను నమోదు చేయాలన్నారు. 30, 31 తేదీల్లో ఆధార్ కార్డుల అప్ డేట్ క్యాంపులు సచివాలయాల్లో కొనసాగుతాయని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమీక్షలో సచివాలయం పర్యవేక్షణాధికారి డిడిఒ మహాలక్ష్మీ, డిఆర్‌డిఎ పీడీ బాలునాయక్, లీడ్ బ్యాంక్ మేనేజర్ వెంకటేశ్వర్లు, ఐసిడిఎస్ పీడీ అరుణ పాల్గొన్నారు.

విలేకర్లతో మాట్లాడుతున్న మారుతివరప్రసాద్ తదితరులు

ఎమ్మెల్యే భూ దందాలు : సిపిఐ

ప్రజాశక్తి - వినుకొండ

ప్రజల కోసం పోరాటాలు చేస్తున్న కమ్యూనిస్టు నాయకులను, కార్యకర్తలను వినుకొండ ఎమ్మెల్యే తూలనాడటం సరికాదని సిపిఐ జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్ అన్నారు. ఈ మేరకు బుధవారం విలేకర్లతో మాట్లాడారు. ప్రజల కోసం త్యాగాలు చేసేది కమ్యూనిస్టులని, అయితే ఎమ్మెల్యే ప్రభుత్వాన్ని అడ్డం పెట్టుకొని భూ దందాల, కబ్జాలు, సెటింట్‌మెంట్లకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే తన తీరు మార్చుకోవాలని హితవుపలికారు. కార్యక్రమంలో నాయకులు బి.శ్రీను, యు.రాము, పి.లాల్‌ఖాన్, కిషోర్, పి.వెంకటేశ్వర్లు, మల్లికార్జున పాల్గొన్నారు.

కరెంటు కోతలతో కష్టపెడుతున్న ప్రభుత్వం

టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు జీవీ ఆంజనేయులు

ప్రజాశక్తి - వినుకొండ

విద్యుత్ కోతల ద్వారా ప్రజలన్ని సిఎం జగన్‌మోహన్‌రెడ్డి కష్టాలు పెడుతున్నారని టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు జీ.వీ ఆంజనేయులు విమర్శించారు. మండలంలోని పెద్దకంచర్లలో టిడిపి మండల అధ్యక్షులు మాదినేని ఆంజనేయులు అధ్యక్షతన 'ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని, సంక్షేమ పథకాల పేరుతో ప్రజలను మోసం చేస్తూ రూ.లక్షల కోట్లు దోచుకుంటున్నారని ఆరోపించారు. అధిక బిల్లులు బనాయిస్తూ పథకాలకు దూరం చేస్తున్నారని, వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టి రైతు మెడకు ఉరితాడు వేస్తున్నారని మండిపడ్డారు. వినుకొండలో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అధికారం అడ్డం పెట్టుకొని పొలిటికల్ రియల్ ఎస్టేట్‌తో వందల కోట్లు దోచుకుంటున్నారని విమర్శించారు. బియ్యం, ఇసుక, మద్యం మాఫియాలతో పాటు ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్నారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో వీరికి గుణపాఠం తప్పదన్నారు. కార్యక్రమంలో ఎం.ఆంజనేయులు, ఎం.కొండలు, వి.అనంద్, కె.వెంకటరెడ్డి పాల్గొన్నారు.

టైలర్ సుబ్బారావుకు నివాళులు

ప్రజాశక్తి-అచ్చంపేట : అచ్చంపేట మండల టైలర్స్ సంఘ ఆధ్వర్యంలో అచ్చంపేట స్టేట్ బ్యాంక్ సెంటర్లో చిలుక చిన్న సుబ్బారావు మొదట వర్ధంతిని బుధవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. సుబ్బారావు దళిత బహుజన రిసోర్స్ సెంటర్ కో-ఆర్డినేటర్‌గానూ పని చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ వృద్ధులకు దుప్పట్లు, భోజన ప్యాకెట్లు కరోనా సమయంలో కూరగాయలు పంపిణీలో సుబ్బారావు కీలకంగా వ్యవహరించారని చెప్పారు. ఈ క్రమంలోనే కరోనా లక్షణాలతో మరణించడం బాధాకరమన్నారు. అనంతరం పేదలకు భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టైలర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు తాయాబ్, గౌరవాధ్యక్షులు టి.ఆంజనేయులు, డిబిఆర్‌సి మండల కన్వీనర్ ఎస్.అశోక్, కె.కిరణ్, రమేష్, ఏడుకొండలు, మౌలాలి, నిలయ్య, హుస్సేన్ బి పాల్గొన్నారు.

నాణ్యమైన వైద్యం అందించండి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - మాచర్ల

పల్నాడు ప్రాంతంలోని పేదలకు అందుబాటులో ఉన్న ప్రధాన వైద్యశాల మాచర్ల ఆస్పత్రేనని, నాణ్యమైన వైద్యసేవలు అందించాలని వైద్యులకు ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సూచించారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధి కమిటీ సమావేశం బుధవారం నిర్వహించగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆస్పత్రి అవసరాలకు తీర్చేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం నిర్మాణంలో ఉన్న బ్లాక్‌లను పరిశీలించారు. డాక్టర్ రంగారావు, సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణమూర్తి, హాస్పిటల్ అభివృద్ధి కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ రామకోటయ్య పాల్గొన్నారు.

నాగిరెడ్డిపాలెంలో వైద్యశిబిరం

ప్రజాశక్తి-బెల్లంకొండ

మండలంలోని నాగిరెడ్డిపాలెం ఎస్‌టి కాలనీలోని ప్రభుత్వం ఆరోగ్య ఉప వద్ద ఆయుష్ వైద్యశిబిరం, అవగాహన సదస్సును బుధవారం నిర్వహించారు. వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన పౌష్టికాహారంపై వైద్యాధికారి డాక్టర్ ఆర్.శ్రీనివాస్ వివరించారు. అనంతరం పలువురికి పరీక్షలు చేసి మందులు అందించారు. కోటేశ్వరి, హనుమంతరావు నాయక్, ఆశలు పాల్గొన్నారు.

దాచేపల్లి మండల పరిషత్ సమావేశం

ప్రజాశక్తి-దాచేపల్లి

మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపిపి కె.జయశ్రీ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. స్థానిక సమస్యలపై సభ్యులు ప్రస్తావించగా అమలు చేస్తున్న పలు పథకాలు, చేపట్టిన పనులపై ఎంపిపి, అధికారులు వివరించారు. సమావేశంలో మండల ప్రత్యేకాధికారి బాబ్రునాయక్, జెడ్‌పిటిసి ఎం.కృష్ణకుమారి, వైఎస్ ఎంపిపి కె.జాన్, ఏవో పాపాకుమారి, ఇఒపిఆర్‌డి ఎన్.రత్నం పాల్గొన్నారు.

కృష్ణాయపాలెంలో లే అవుట్‌ల పరిశీలన

ప్రజాశక్తి-మంగళగిరి రూరల్

రాజధాని ప్రాంతంలోని కృష్ణాయపాలెం ఇళ్ల స్థలాల లేఅవుట్ ను గుంటూరు జిల్లా కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే ఆర్కే బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ పేదోడు గొప్పవాడు కావాలని ఆకాంక్షించిన ప్రభుత్వం ముందుకు వెళుతోందని అన్నారు. ఎవరు ఎన్ని కుయుక్తులు పన్నినా అంతిమ విజయం పేదవాడి వైపే నిలిచిందని, ఇళ్ల పట్టాల పంపిణీకి చిక్కులు తొలగిపోయాయని అన్నారు. రాష్ట్రం మొత్తం రెండు సంవత్సరాల క్రితమే ఇళ్ల స్థలాలను పంపిణీ చేయగా ప్రతిపక్షాల కుట్రలతో ఈ ప్రాంతంలో ఆలస్యమైందని, ముఖ్యమంత్రి కృషి ఫలితంగా ఈ ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం జరగనున్నట్లు చెప్పారు. మంగళగిరి - విజయవాడ నగరాలకు అతి సమీప ప్రాంతమైన ఇక్కడ ఒక పక్క నేషనల్ హైవే బైపాస్ రోడ్డు మరో పక్క కృష్ణా నదిపైవంతెన నిర్మాణం జరగనుండడంతో ఈ ప్రాంతం బంగారు మయంగా మారనుందని అన్నారు. ఈ ప్రాంతంలో ఇళ్ల నిర్మాణ పను లను అధికారులు వేగవంతం చేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో మంగళగిరి-తాడేపల్లి నగర పాలక సంస్థ కమిషనర్, సిఆర్‌డిఎ, రెవెన్యూ, ఇంజనీరింగ్ విభాగ అధికారులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల లేఅవుట్ ను పరిశీలించేందుకు వెళుతున్న ఎమ్మెల్యే ఆర్‌కె, కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

టిడ్కో గృహాల పరిశీలన

ప్రజాశక్తి-తాడేపల్లి

పెనుమాకలో నిర్మించిన టిడ్కో ఇళ్ల సముదాయాన్ని బుధవారం స్థానిక ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ఎంటిఎంసి అధికారులతో కలిసి పరిశీలించారు. టిడ్కో ఇళ్లను లబ్దిదారులకు ఇవ్వడానికి అధికారులు ఇటీవల లబ్దిదారుల జాబితాను విడుదల చేశారు. ఇళ్లల్లో కొద్దిపాటి మరమ్మతులను కూడా చేయించారు. ఈ నెల 26న జరగనున్న సిఎం సభలో టిడ్కో ఇళ్లు లబ్దిదారులకు పత్రాలిచ్చి గృహ ప్రవేశాలు చేయించే అవకాశం ఉంది. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ఎం.వేణుగోపాల రెడ్డి, తాడేపల్లి తహశీల్దార్ నాగిరెడ్డి, ఎంటిఎంసి కమిషనర్ శారదాదేవి, డిఇ కృష్ణారెడ్డి, ఎఇ కిషోర్‌రెడ్డి పాల్గొన్నారు.

గ్రంథ పఠనం నిత్యకృత్యం కావాలి

ప్రజాశక్తి-తెనాలి

విద్యార్థుల జ్ఞానసముపార్జనకు గ్రంథాలయాలు తోడ్పడతాయని, దానిని ఉపయోగించుకునేలా తల్లి దండ్రులు వారిని ప్రోత్సహించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె.ఝాన్సిలక్ష్మి అన్నారు. స్థానిక నెహ్రూం రోడ్డులోని శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిభిరాన్ని ఆమె బుధవారం సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడారు. శిక్షణలో వారు నేర్చుకుంటున్న అంశాలను విద్యార్థుల ద్వారా తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి శిక్షణా శిభిరాలను విద్యార్థుల్లో సృజనాత్మకతకు పదుపుపెట్టేందుకు నిర్వహిస్తున్నామన్నారు. శిక్షణా శిబిరం నిర్వహణకు పాటించాల్సిన నియమ నిబంధనలను ఆమె వివరించారు. కాగా శిక్షణలో భాగంగా వ్యక్తిత్వ వికాసంపై శ్రీమన్నారాయణ, జాతీయ గీతాలపై జనవిజ్ఞాన సమితి కార్యకర్త అబ్దుల్ హుస్సేన్ విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో గ్రంధాలయాధికారిణి కె.రమాదేవి, సిబ్బంది లావణ్య, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మంగళగిరి సాహితీ కళా వేదిక కన్వీనర్ జి. ధనుంజయరావు

నేడు ఎన్టీఆర్ శత జయంతి వేడుకలు

ప్రజాశక్తి - మంగళగిరి

తెలుగు కళామతల్లి ముద్దుబిడ్డ, విశ్వవిఖ్యాత నట సార్వభౌముడు పద్మశ్రీ డాక్టర్ ఎన్టీ రామారావు తెలుగు గడ్డపై పుట్టడం తెలుగు వారు చేసుకున్న అదృష్టం అని మంగళగిరి సాహితీ కళా వేదిక కన్వీనర్ గుత్తికొండ ధనుంజయరావు అన్నారు. ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాలు మంగళగిరి సాహిత్య కళా వేదిక ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం 6 గంటలకు, పాత మంగళగిరిలోని శ్రీ పొట్ల బత్తుని వెంకటేశ్వరరావు కళానిలయం (లక్ష్మీ శారీస్ బిల్డింగ్ పైన)లో నిర్వహించనున్నట్లు చెప్పారు. బుధవారం కళాని లయంలో జరిగిన విలేకరుల సమా వేశం లో ఆయన మాట్లాడుతూ కళా రంగాలకు చెందిన కొంత మంది ప్రముఖులను సన్మానించనున్నట్లు చెప్పారు. సమావేశంలో వివిధ కళాపరిషత్తుల నిర్వాహకులు ఆర్. కృష్ణార్జునరావు, కె. కాశయ్య, జి.మోహన్‌రావు (పాల చంటి), పి.లక్ష్మణ రావు, మహమ్మద్ యూసఫ్, ఎ.తాతారావు, ఎస్. భూపతి పాల్గొన్నారు.

పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించండి

ప్రజాశక్తి-తెనాలి

జగన్ సర్కార్ రాష్ట్రాన్ని అంధకారంలోకి నెడుతోందని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ధ్వజమెత్తారు. అప్రకటిత విద్యుత్ కోతలు ఎత్తివేయాలని, పెంచిన విద్యుత్ చార్జీలను తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేస్తూ బుధవారం చెంచుపేటలోని విద్యుత్ ఈఈ కార్యాలయం ఎదుట టిడిపి నాయకులు బైఠాయించి నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ విద్యుత్ మిగులుతో రాష్ట్రాన్ని జగన్ కి అప్పగిస్తే, విద్యుత్ లేని రాష్ట్రంగా తయారు చేశారన్నారు. యూనిట్ కి పైసా కూడా పెంచకుండా చంద్రబాబు పాలన చేశారని, వైసిపి ప్రభుత్వంలో గణనీయంగా విద్యుత్ ఛార్జీలు పెంచేశారని విమర్శించారు. చివరికి సౌర విద్యుత్తునూ నాశనం చేశారని ధ్వజమెత్తారు. నిరంతర విద్యుత్ కోతలతో రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టిన ఘనత జగన్ కే దక్కుతుందని, విద్యుత్ సర్‌ఛార్జీలు, ట్రూ అప్ చార్జీల పేరిట పేద ప్రజలపై ప్రభుత్వం భారం మోపిందని అన్నారు. విద్యుత్ చార్జీలను ఇష్టానుసారంగా పెంచిన ప్రభుత్వం, ఆ ఆదాయాన్ని ఏం చేస్తోందని ప్రశ్నించారు. ఎన్నికలవేళ విద్యుత్ ఛార్జీలు పెంచబోమని నాడు హామీ ఇచ్చిన జగన్, దానిని విస్మరించారన్నారు. విద్యుత్ కార్పొరేషన్ మీద తీసుకున్న 25 వేల కోట్ల ప్రజాధనం ఏమైందో జగన్ ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. విద్యుత్ కొరత కారణంగా రాష్ట్రం నుంచి పరిశ్రమలు కూడా పారిపోతున్నాయని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి పెంచిన విద్యుత్త్ ఛార్జీలను తగ్గించాలని, అప్రకటిత విద్యుత్ కోతలు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు విద్యుత్ ఈఈ చిరంజీవికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో నాయకులు టి.హరి ప్రసాద్,మహమ్మద్ ఖుద్దూస్, కౌన్సిలర్‌లు దివి అనిత, బ్రహ్మేశ్వరరావు ,అన్నం పిన్నారావు, నాయకులు కె.కోటేశ్వరరావు, పి.నరేంద్ర, జెట్టి రేణుక, పి.మహేష్, ఎ.రమేష్, ఈ.వెంకట పూర్ణచంద్, కె. శ్రీనివాసరావు, పి.రమ్య, కె.ఏడుకొండలు, పాల్గొన్నారు

విద్యుత్ ఈఈ కార్యాలయం వద్ద బైఠాయించిన మాజీ మంత్రి ఆలపాటి, టిడిపి నాయకులు

వడ్డేశ్వరం జడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయుల ప్రచారం

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం హై స్కూల్ ఉపాధ్యాయులు బుధవారం వడ్డేశ్వరం గ్రామంలో ఇంటింటికి ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలుగు, ఇంగ్లీషు మాధ్యమాలలో 20 మంది నిష్ణాతులైన ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులతో మంచి విద్యా బోధన చేస్తూ, పదవ తరగతి లో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నామని, చిన్నారుల ఉజ్వల భవిష్యత్తుకు వడ్డేశ్వరం జిల్లా పరిషత్ హై స్కూల్లో పిల్లలను చేర్పించాలని, ఉపాధ్యాయులు ఫ్లెక్సీ పట్టుకొని గ్రామంలో విస్తృత ప్రచారం చేపట్టారు. ప్రచార కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.సుబ్బారావు, ఉపాధ్యాయులు కాకుమాను జోజప్ప పాల్గొన్నారు.

నాగేశ్వరరావును జ్ఞాపికతో సత్కరిస్తున్న ఎన్టీఆర్ ఉత్సవ కమిటీ సభ్యులు

గాయకుడు నాగేశ్వరరావుకు సత్కారం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, సినీ మాటల రచయిత బుర్రా సాయి మాధవ్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఎన్టీఆర్ శకపురుషుని శతజయంతి ఉత్సవాల్లో భాగంగా స్థానిక పెమ్మసాని థియేటర్‌లో బుధవారం ఎన్టీఆర్ నటించిన 'జస్టిస్ చౌదరి' చిత్రం ఉచితంగా ప్రదర్శించారు. శతాబ్ది ఉత్సవాల్లో రోజుకొక కళాకారులను సత్కరించే కార్యక్రమంలో భాగంగా ప్రముఖ గాయకుడు, సాంఘిక, పౌరాణిక, రేడియో కళాకారుడు తోట నాగేశ్వరరావును నాయకులు మాజీ జిల్లా పరిషత్ ఉపాధ్యక్షులు వడ్లమూడి పూర్ణచంద్రరావు, తాడిపోయిన హరి ప్రసాద్, వై సాంబశివరావు, ఈదర వెంకట పూర్ణచంద్, సోమవారపు నాగేశ్వరరావు, శాఖమూరి చిన్న తదితరులు ఎన్టీఆర్ జ్ఞాపికను అందించి సత్కరించారు. కార్యక్రమంలో థియేటర్ కమిటీ సభ్యులు పెమ్మసాని పోతురాజు, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, ఈదర శ్రీనివాసరావు, డాక్టర్ ఆవుల చక్రవర్తి, రావి సూర్యకిరణ్ తేజ, ఎన్టీఆర్ జగన్, చుక్కపల్లి పెదబాబు, గుమ్మడి ప్రసాద్, ముళ్ళపూడి వెంకట్, కుదరవల్లి శ్రీనివాసరావు, నల్లూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉండాలనుకుంటే పని చేయండి..

హౌసింగ్ పురోగతిపై సమావేశంలో డిపిఒ

ప్రజాశక్తి-ప్రత్తిపాడు

'ఉండాలనుకుంటే పని చేయండి.. లేకపోతే మీ ఇష్టం' అని పంచాయతి కార్యదర్శులు, సచివాలయ ఇంజనీరులతో ఏర్పాటు చేసిన సమావేశంలో డిపిఒ కేశవరెడ్డి అన్నారు. హౌసింగ్ పురోగతిపై బుధవారం స్థానిక ప్రత్తిపాడు మండల పరిషత్ కార్యాలయంలో ఈ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఎంపిడిఒ శ్రీ రమ్య అధ్యక్షత వహించారు. గ్రామ పంచాయతీల కార్యదర్శులు, సచివాలయ ఎఇలతో విడివిడిగా డిపిఒ అడిగి తెలుసుకున్నారు.

ఆ గ్రామంలోని జగనన్న కాల నీల పురోగతిపై ఆరా తీశారు. సమావేశం నిర్వహించిన ప్రతి సారి అదే టార్గెట్‌ని చెబుతున్నారే తప్ప పూర్తవడం లేదని అన్నారు. జూన్ నెల మొదలైతే వర్షాలు అధికంగా ఉంటాయని ఇప్పటికే వాతావరణ శాఖ హెచ్చరిస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. పన్నుల బకాయిలు ఎందుకు వసూలు చేయడం లేదంటూ పం చాయతి కార్యదర్శులపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు . ఉండాలనుకుంటేనే పని చేయండి లేకపోతే మీ ఇష్టం అని అన్నారు. గొట్టిపాడు పంచాయతి కార్యదర్శిని పిలిచి శానిటేషన్ జరగడం లేదని, ట్రాక్టర్ కూడా మూడు నెలల నుంచి బయటకు ఎందుకు తీయడం లేదని ప్రశ్నించారు. దీనికి ఆ పంచాయతి కార్యదర్శి సమా ధానమిస్తూ అక్కడ ఒక పైసా కూడా డ్రా చేయనికుండా చేస్తున్నారని, సెప్టెంబర్ నుండి ఏ బిల్లు కూడా డ్రా చేయలేదని, కనీసం ప్రాథమిక అవసరాలు కూడా తీర్మానం చేయడం లేదని అన్నారు. వెంటనే మండల పంచాయతీరాజ్ శాఖ అధికారికి తెలిపి రికార్డ్స్ పరిశీలించాలని అన్నారు.

వంద శాతం టార్గెట్ అవడం లేదు

జగనన్న కాలనీల పురోగతిపై ఎప్పుడు టార్గెట్ ఇచ్చినా టార్గెట్ వందశాతం అవడం లేదని,దీనిపై జిల్లా కలెక్టర్ సీరియస్ గా ఉన్నారని ఎంపిడిఒ శ్రీ రమ్య అన్నారు. గ్రామ పంచాయతీల్లో కేటాయించిన స్పెషల్ ఆఫీసర్,యానిమేటర్,సచివాలయ ఏఈలు ఇలా అందరూ కలిసి ఒకేసారి లబ్ధిదారుల దగ్గరికి వెళ్లడం చేయడం లేదని అన్నారు.

ఇంగ్లీషు నేర్చుకోవడం సులభం

ప్రజాశక్తి-తాడేపల్లి

ఇష్టంగా చదివితే ఇంగ్లీషు సులభంగా నేర్చుకోవడం కష్టమేమీ కాదని స్పోకెన్ ఇంగ్లీషులో నిష్ణాతులైన ఎం.రత్నకమల్ చెప్పారు. విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో సుందరయ్య నగర్‌లో జరుగుతున్న ఉచిత స్పోకెన్ ఇంగ్లీషు తరగతుల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా రత్నకమల్ మాట్లాడుతూ నిరంతరం విద్యార్థుల్లో సామాజిక చైతన్యం సృజనాత్మకత పెంచడానికి మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం, సుందరయ్య సాంస్కృతిక సేవా సమితి, ఎంకెఆర్ ట్రస్టు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ప్రపంచ అనుసంధాన భాష ఇంగ్లీషు నేడు విద్యార్థులకు ఎంతో అవసరముందన్నారు. ఇంటర్నెట్‌లో అపార సమాచారాన్ని తెలుసుకోవాలంటే ఇంగ్లీషు పరిజ్ఞానం అవసరమని తెలిపారు. ముందు ఇంగ్లీషులో మాట్లాడాలంటే భయం పోవాలని, తేలిగ్గా నేర్చుకోగలమనే ధైర్యం రావాలని చెప్పారు..

బాలికల్లో రక్తహీనతను అధిగమించాలి

పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్

ప్రజాశక్తి-నరసరావుపేట

బాలికల్లో రక్త హీనత అధిగమించాలని రక్త హీనత ఉన్న బాలికలకు ఐరన్ ఫోలిక్ యాసిడ్ టాబ్లెట్ సకాలంలో సరఫరా చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ ఆదేశించారు. ఆధార్ నిర్వహణకై నిర్వహించే ప్రామాణిక పరీక్షలలో డిజిటల్ అసిస్టెంట్లు, ఎడ్యుకేషన్ డేటా ప్రాసెసర్లు ఉద్దేశపూర్వకంగా ఉత్తీర్ణత సాధించకుండా ఉండే వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు జీతభత్యాలు నిలుపుదల చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి హెచ్చరించారు. బుధవారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలోని బి.ఆర్ అంబేద్కర్ స్పందన హాల్లో కమాండ్ కంట్రోల్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్ణయించుకున్న అభివృద్ధి లక్ష్యాలపై కమాండ్ కంట్రోల్ సిబ్బంది, క్షేత్రస్థాయిలోని ఐసిడిఎస్, అంగన్వాడి సిబ్బందితో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరిపి సరైన సమాచారాన్ని రాబట్టాలని ఆయన సూచించారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. రక్తహీనత ఎక్కువగా ఉన్న పిల్లలు ఎంతమంది, ఎంతమందికి వైద్య సేవలు అందిస్తున్నారనే వివరాలను ఎప్పటికప్పుడు నివేదికల రూపంలో పొందుపరచాలన్నారు. గర్భిణులకు అందిస్తున్న వైయస్సార్ సంపూర్ణ పోషణ, హాట్ కుక్కుడ్ మీల్స్ సకాలంలో అందరికి అందించేలా సంబంధిత శాఖ అధికారులు కృషి చేయాలి అన్నారు. ప్రతి గురువారం చీఫ్ సెక్రటరీ నిర్వహించే వీడియో కాన్ఫరెన్స్‌కు సరైన నివేదికలు ఉండేలా అందించాలన్నారు. బాలామృతం అందించే ప్రక్రియలో కాలం చెల్లిన వాటిని వినియోగించ కుండా ఉండేలా సంబంధిత సిబ్బందికి అవగాహన కల్పించేలా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో వాలంటీర్ల పోస్టులు ఎన్ని ఖాళీలు ఏర్పడ్డాయి, ప్రొబేషన్ డిక్లరేషన్ విషయాల్లో ఇంకా సమస్యలు ఏమన్నా ఉన్నాయా అడిగి తెలుసుకున్నారు. అమ్మవడి అందని అనాధ బాలల పూర్తి వివరాలు సేకరించి తక్షణమే అమ్మవడి నగదు అందేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇప్పటి వరకు 242 మందిని గుర్తించడం జరిగిందని 157 మంది వివరాలు పూర్తిగా సేకరించామని మిగిలిన వారి వివరాలను కూడా సేకరించి సకాలంలో నగదును అందజేయాలన్నారు. 1902 టోల్ ఫ్రీ నెంబర్‌కు వచ్చిన కాల్స్, స్పందించిన తీరు సవివరంగా పూర్తిస్థాయిలో నివేదికను అందించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి అరుణ, గ్రామ వార్డు సచివాలయాలు అధికారి మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సిబ్బందితో మాట్లాడుతున్న పల్నాడు జిల్లా కలెక్టర్

మాతా,శిశు మరణాల నివారణకు కృషి చేయాలి

పల్నాడు జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ జి.శోభారాణి

ప్రజాశక్తి-నరసరావుపేట

మాత శిశు మరణాల నివారణకు కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జి.శోభారాణి అన్నారు. బుధవారం స్థానిక జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఉప జిల్లా స్థాయి మాతృ మరియు శిశు మరణాల సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. గత నెలలో దుర్గి మండలం ముత్తుకూరు ప్రాథమిక ఆరోగ్య పరిధిలో వాటిల్లిన మాతృ మరణంపై సమీక్ష సమావేశంలో కమిటీ సభ్యులు మరియు ప్రైవేటు మరియు ప్రభుత్వ వైద్యాధికారులు సమక్షంలో మరణానికి గల కారణాలను అధిగమించే అంశాలను చర్చించారు. కార్యక్రమంలో ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ బి.వి రంగారావు, డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఒ డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ మంత్రు నాయక్, డాక్టర్ పి సింధుజ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి

డ్రోన్ టెక్నాలజీకి వర్సిటీ వేదిక

పిబిసి ఏరోహబ్, ఐఒటెక్‌తో ఆచార్య నాగార్జున యూనివర్శిటీ ఎంఒయు

ప్రజాశక్తి-ఎఎన్‌యు :రాష్ట్రవ్యాప్తంగా భవిష్యత్తులో వ్యవసాయ రంగానికి సాంకేతికంగా తోడ్పాటును అందించటానికి కావలసిన డ్రోన్ టెక్నాలజీ అందించుటలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వేదిక కానున్నదని విశ్వవిద్యాలయ ఉపకులపతి పేర్కొన్నారు. దానిలో భాగంగా బుధవారం పిబిసి ఎరోబిక్, ఐఒటెక్ సంస్థలతో కీలక ఎంఒయు ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు. ఈ సంస్థల సహకారంతో విశ్వవిద్యాలయంలో ఇంటర్ విద్యార్థుల దశ నుండి ఉన్నత విద్యలను అభ్యసించే విద్యార్థుల వరకు డ్రోన్ టెక్నాలజీపై అవగాహన పెంపొందించుకునేలా ఎక్సలెన్సీ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్లు రిజిస్ట్రార్ ఆచార్య బి కరుణ, డాక్టర్ వైఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిద్దయ్య తెలిపారు. యూనివర్సిటీ నుండి తయారు చేసిన డ్రోన్‌లను వ్యవసాయ రంగానికి ఉపయోగపడేలా ప్రభుత్వ, ప్రైవేటు రంగాల వారికి సైతం డ్రోన్ టెక్నాలజీతో శిక్షణ ఇస్తామని తెలిపారు. విధి విధానాలను త్వరలో ప్రకటిస్తామన్నారు. కార్యక్రమంలో సంస్థల డైరెక్టర్‌లు ప్రసాద్, భరద్వాజ, రత్నాకర్ పాల్గొన్నారు.

పైప్‌లైన్ మరమ్మతులను పరిశీలించిన మేయర్

ప్రజాశక్తి-గుంటూరు

నగరంలో నెహ్రూ నగర్ రిజర్వాయర్ నుండి లక్ష్మీపురం హెచ్.యల్.ఆర్ రిజర్వాయర్ కు తాగునీరు సరఫరా జరిగే 800 యం.యం డయా పైప్ లైన్‌కు సంజీవయ్య నగర్ రైల్వే గేటు వద్ద ఏర్పడిన లీకు మరమ్మతు పనులను బుధ్‌వారం నగర మేయర్ కావటి శివనాగ మనోహర్‌నాయుడు, స్థానిక ప్రజా ప్రతినిధులు కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ మరమ్మతు పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి త్రాగు నీటి సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని మేయర్ ఇంజినీరింగ్ అధికారుల్ని ఆదేశించారు. బుధవారం సాయంత్రానికి పూర్తి చేసి త్రాగు నీటిని యదావిధిగా పునరుద్దరించాలన్నారు. అంతేకాక ఎమినిటి కార్యదర్శులు తమ పరిధిలో పైప్ లైన్లకు లీకుల ఏర్పడి మరమ్మతులకు లోనైతే, వాటిని గుర్తించి వెంటనే ఉన్నతాధికారులకు తెలియచేయాలన్నారు. ఆవిధంగా చేయటం వలన పైప్ లైన్లకు మరమ్మతులు నిర్వహించి, ప్రజలు ఇబ్బందులు పడకుండా చేయుటకు అవకాశం ఉంటుందన్నారు.పర్యటనలో కార్పొరేటర్లు అయిశెట్టి కనకదుర్గ శ్రీనివాసరావు, ధూపాటి వంశీ, పాపతోటి అంబేద్కర్, అగ్గిపెట్టి రాజు తదితరులు పాల్గొన్నారు.

పైప్‌లైన్ మరమ్మతు పనులు పరిశీలిస్తున్న మేయర్, అధికారులు

శ్మశానాల అభివృద్ధికి చర్యలు

ప్రజాశక్తి-గుంటూరు

నగరంలోని స్మశాన వాటికల్లో ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా గ్రీనరీని అభివద్ధి చేసి, అన్ని రకాల మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటామని నగర మేయర్ కావటి శివనాగ మనోహర్‌నాయుడు తెలిపారు.బుధవారం నగరంలోని శ్రీనివాసరావుపేటలోని హిందూ స్మశాన వాటికలో జిఎంసి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వివిధ అభివృద్ధి పనులను పరిశీలించి, తదుపరి సంపత్ నగర్‌లోని మేయర్ క్యాంపు కార్యాలయంలో జిఎంసి ఇంజినీరింగ్ అధికారులు, ప్రజాప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి తీసుకోవాల్సిన చర్యలపై ఇంజినీరింగ్ అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ జిఎంసి పరిధిలోని స్మశానాల అభివద్ధికి ప్రత్యేక కార్యచరణ ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. అలాగే గుంటూరు నగరంలోని స్మశానాలను అభివద్ధి చేయుటకు స్వచ్ఛంద సేవా సంస్థల సహాయ సహకారాలు కూడా తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో వివిధ డివిజన్ల కార్పొరేటర్లు నిమ్మల వెంకటరమణ, కాంద్రుకుంట గురవయ్య, జిఎంసి ఎస్ఈ భాస్కరరావు, ఈ.ఈ సుందర రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆర్‌జెడి సుబ్బారావు

బదిలీల ప్రక్రియకు సహకరించాలి

ఉపాధ్యాయ సంఘాలతో విద్యాశాఖాధికారులు సమావేశం

ప్రజాశక్తి-గుంటూరు

ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ఉపాధ్యాయ సంఘాల నాయకుల సమావేశం పాఠశాల విద్య ఆర్‌జెడి వి.ఎస్.సుబ్బారావు అధ్యక్షతన బుధవారం స్థానిక పాతబస్టాండ్ వద్ద గల పరీక్షా భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌జెడి మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం బదిలీలు, పదోన్నతులు పారదర్శకంగా జరిగే విధంగా సంఘాలు సహకరించాలని కోరారు. ఏమైనా సమస్యలు ఉంటే జిల్లా విద్యాశాఖ అధికారి దృష్టికి తీసుకురావాలని సూచించారు. మా స్థాయిలో పరిష్కారం కాని సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లటం జరుగుతుందన్నారు. సమావేశంలో వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు తమ దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. డిఇఒ పి.శైలజ మాట్లాడుతూ సీనియారిటీ జాబితాలో ఏవైనా తప్పులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. నిబంధనల ప్రకారం ఉపాధ్యాయులు బదిలీలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునేలా కృషి చేయాలన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని డిడిఒలు అందరూ ఉపాధ్యాయులకు అందుబాటులో ఉండాలని అన్నారు. సమావేశంలో వివిధ సంఘాల నాయకులు ఇచ్చిన వినతులను పరిష్కరిస్తామన్నారు. సమావేశంలో ఉప విద్యాశాఖ అధికారి కె.సుధాకర్‌రెడ్డి, ఉర్దూ డిఐ ఖాసిం, ఏఎస్ఒ వి.నాగేశ్వరరావు, సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్రమోషన్ల కౌన్సెలింగ్ మాన్యువల్‌గా నిర్వహించాలి

ఉపాధ్యాయ సంఘాలు

ప్రజాశక్తి-గుంటూరు

ప్రమోషన్లు ప్లేసులు చూపించి, మాన్యువల్ కౌన్సెలింగ్ ద్వారానే నిర్వహించాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు కోరారు. బుధవారం పదోన్నతులు, బదిలీల నేపథ్యంలో ఉపాధ్యాయ సంఘాలతో ఆర్‌జెడి, డిఇఒ నిర్వహించిన సమావేశంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు మాట్లాడుతూ బదిలీలలో కమిటీకి కట్టబెట్టిన ప్రత్యేక అధికారం దుర్వినియోగం కాకుండా చూడాలని కోరారు. మానవతా కోణం పేరుతో రాజకీయ ఒత్తిడిలు జరిగితే సహించేది లేదని స్పష్టం చేశారు. సాఫ్ట్‌వేర్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని కోరారు. ప్రమోషన్ లిస్టులు ఖాళీల లిస్టులు సకాలంలో విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.ఆదిలక్ష్మి, ఎం.కళాధర్, యుటిఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్షులు పి.ప్రేమ్‌కుమార్, ఎస్‌టియు అధ్యక్ష, కార్యదర్శులు జి.మోహన్‌రావు, సిహెచ్. నరసింహారావు, ఎపిటిఎఫ్ 257 అధ్యక్ష, కార్యదర్శులు కె.బసవలింగారావు, ఎండి.ఖలీద్, ఎపిటిఎఫ్ 1938 కార్యదర్శి మేకల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందిస్తున్న కౌన్సిలర్, ఉపాధ్యాయులు

పదిలో సత్తాచాటిన విద్యార్థులకు అభినందన

ప్రజాశక్తి-తెనాలి

స్థానిక ఐతానగర్ ఎన్ఎస్ఎస్ఎం హైస్కూల్‌లో పదోతరగతి ఫలితాల్లో సత్తా చాటిన విద్యార్థులు అభినందన సభ బుధవారం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.రాజకిషోర్ అధ్యక్షతన జరిగిన సభలో వార్డు కౌన్సిలర్ గెడ్డటి సురేంద్ర ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివేందుకు విద్యార్థులను ప్రోత్సహించిన తల్లిదండ్రులు గొప్పవారన్నారు. దానికి దీటుగా ఫలితాలు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు. ఓ ప్రణాళిక ప్రకారం చదివితే ఉన్నత విజయాలను సొంతం చేసుకోవచ్చున్నారు. 11 మంది విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించారని, వారిలో ముఖ్యంగా బి.పుష్పాంజలి 558, ఎం.అక్షయ 555 మార్కులు సాధించినట్లు చెప్పారు. విద్యార్థులను నగదు ప్రోత్సాహకాలతో సత్కరించారు. కార్యక్రమంలో పిఎంసి చైర్మన్ రాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కొమ్మమూరు కాల్వపై త్వరలో ఫుట్‌బ్రిడ్జ్

ప్రజాశక్తి-దుగ్గిరాల

స్థానిక బాలికల హైస్కూల్ వద్ద కొమ్మ మూరు కాలువపై ఫుట్ బ్రిడ్జ నిర్మాణ పనులకు బుధవారం జల వనరుల శాఖ ఎఇఎ వనిత శ్రీకారం చుట్టారు. గురువారం నుండి పనులు ప్రారంభించనునట్లు ఆమె తెలిపారు. జల వనరుల శాఖ పర్య వేక్షణలో కాంటినెంటల్ కాఫీ ఫ్యాక్టరీ సహ కారంతో ఫుట్ బ్రిడ్జ్ నిర్మాణం జరుగుతుందని తెలిపారు. రూ.35లక్షల అంచనా వ్యయంతో పాఠశాలలు ప్రారంభించే జూన్ నాటికి నిర్మాణం పూర్తి అవుతుందని తెలిపారు. ఏడు మీటర్ల వెడల్పుతో నిర్మించే ఫుట్ బ్రిడ్జ పాదచారులతో పాటు చిన్న, చిన్న వాహనదారులకు కూడా ఉపయోగపడుతుం దన్నారు. ఇటీవల కాలంలో మట్టి నమూనాలు పరిశీలించగా ఇసుకలేని బ్లాక్ కోట్ సాయిల్‌లో ఉన్నట్లు నివేదిక వచ్చిందని, ఇది బ్రిడ్జ్ నిర్మాణానికి అనుకూలమని ఎఇ తెలిపారు. నిర్మాణం పూర్తి అయితే పరిసర ప్రాంత ప్రజల 150 సంవత్సరాల కల నెరవేరుతుందని వనిత తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు బాణావత్ వెంకటేశ్వర నాయక్, షేక్ నాగూర్ తదితరులు పాల్గొన్నారు.